RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:73 SATURDAY ,AUGUST 22,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :73 శనివారం, ఆగష్టు 22, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు అందుకే అనుమతి ఇవ్వలేదు..



రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు ఎంఈఏ అనుమతి నిరాకరణ

పర్యటన కార్యక్రమం హోదాకు, ఉద్దేశానికి తగినట్లు లేదని కేంద్రం స్పష్టీకరణ

విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి

అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని సీఎంవో ప్రకటన

ప్రస్తుతం లండన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. 2

# ధర్మపురి అర్వింద్ అతితెలివిని ప్రదర్శిస్తూ మాట్లాడుతున్నారు

- దేశ వ్యతిరేక శక్తులను కలవడానికే రేవంత్ విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అర్వింద్
- కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే విదేశీ పర్యటనలకు వెళ్లారన్న శ్రీనివాస్
- తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని వ్యాఖ్య



తెలంగాణ పత్రిక ప్రతినిధి:: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలపై విమర్శలు చేస్తున్నారంటూ నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక అనుమతులతోనే ముఖ్యమంత్రి పర్యటనకు వెళ్లారని, దాన్ని కూడా రాజకీయం చేయడం బీజేపీ నేతల దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. లండన్‌లోని ప్రముఖ విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలను సందర్శించి తెలంగాణకు ఉపయోగపడే ప్రమాణాలను సీఎం పరిశీలిస్తుంటే బీజేపీ మిగతా2లో

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

- బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం
- తెలంగాణాలోని 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు
- కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు



తెలంగాణ పత్రిక ప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురు స్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావం కారణ ంగా తెలంగాణలో నెల మిగతా2లో

# షావుకారు జానకి మరణం

## సినీ ప్రముఖుల నివాళులు..



తెలంగాణ పత్రిక ప్రతినిధి:: ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా షావుకారు జానకికి నివాళులు అర్పిస్తున్నారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. షావుకారు జానకి సేవలు చిరస్మరణీయం: చిరంజీవి షావుకారు జానకి మరణంపై మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ‘ ప్రముఖ నటి, మిగతా2లో

# తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం అరుదైన పాదయాత్రే నిదర్శనం.!

తెలంగాణ రాజకీయాల్లో మరో అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం శ్రమించే జననేత, గులాబీ బాస్ కేసీఆర్ పై తెలంగాణ ప్రజలకున్న అభిమానం సాటిలేనిది. 2






# మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ నేతల తిరుగుబాటు..!

## సీఎం వచ్చాకే స్పందిస్తానన్న సుస్మిత పటేల్

తెలంగాణ పత్రిక ప్రతినిధి: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి తీవ్ర రూపం దాల్చాయి. మంత్రి కొండ సురేఖతో పాటు ఆమె కుమార్తె సుస్మిత పటేల్‌పై సొంత పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక రాజకీయ పరిణామాలు, మిగతా2లో

# పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..



- పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ
- ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా
- జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ
- పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన



# చక్కెర ధరలకు కళ్లెం..

## 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్.!

తెలంగాణ పత్రిక ప్రతినిధి: ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. వాటిలో ఊహించిన దానికంటే తక్కువ దేశీయ చక్కెర ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, చెరకు 12లో

# తెలంగాణలో భూములకు రికార్డు ధర




తెలంగాణ పత్రిక ప్రతినిధి: తెలంగాణలో భూముల ధరలకు రెక్కలొ స్తున్నాయి. రికార్డు స్థాయిలో ధర లు పలుకుతుండటం అందరిని ఆశ్చ ర్యానికి గురి చేస్తోంది. హైదరాబా ద్‌లోని రాయదుర్గంలో ఎకరం భూమి ఏకంగా 264 కోట్లు పలికింది. దీంతో ఇప్పుడు రియల్ ఎస్టేట్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇంత ధర పలుకడం ఇది రికార్డుతెలంగాణలో భూముల ధరలు రికార్డు స్థాయిలో పలుకుతున్నాయి. హైదరాబాద్‌లోని రాయయదుర్గంలో ఎకరం భూము ధర వింటే మీరే షాకవుతారు. అక్షరాల 264 కోట్ల రూపాయలు. ఇప్పుడు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మరోసారి భూముల ధరలు రికార్డు స్థాయికి చేరాయి. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నిర్వహించిన భూముల మిగతా2లో

# కబ్జాకోరులకు మల్కాజ్‌గిరి మహిళా సీపీ షాక్..




- హైదరాబాద్‌లో 80 ఏళ్ల వృద్ధురాలి భూమికి రక్షణ
- రూ.40 కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నం
- మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించిన వృద్ధురాలు



# సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

- రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- వేలాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- గచ్చిబౌలి భూములకు, ఈ భూములకు సంబంధం లేదన్న తెలంగాణ ప్రభుత్వం
- ఏవైనా అభ్యంతరాలుంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచన

తెలంగాణ పత్రిక ప్రతినిధి: తెలంగాణలోని రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయ ఓస్థానం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య మిగతా2లో

# హైకోర్టులో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ..



హైదరాబాద్, ఆగస్టు 21: తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మిగతా2లో

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు అందుకే అనుమతి ఇవ్వలేదు..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ముఖ్యమ ంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమా లను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పా రు. సంబంధిత పదవికి, పర్యటన ఉద్దేశానికి తగిన ట్లుగా కార్యక్రమం ఉండాలని స్పష్టం చేశారు. రేవం త్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమా ణానికి అనుగుణంగా కార్యక్రమం లేదని, అందుకే రాజకీయ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. బ్రిటన్ పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చినట్లు గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఆగస్టు 30న హైదరా బాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే అమెరికా పర్యట నకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన ముందే హైదరాబాద్ చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి పెట్టుబడిదారులను కలవాల్సి ఉన్నట్లు తెలంగాణ సీఎంవో వెల్లడించింది. ఈ పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించడంతో పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని తెలిపింది.

# సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

తెలంగాణలోని రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ వేలాన్ని నిలిపివే యాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయ ఓస్థానం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిం ది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరే షన్ (టీజీఐఐసీ) రాయదుర్గం పాన్ మక్తాలోని సుమా రు 11 ఎకరాల భూమిని వేలం వేసేందుకు నోటిఫి కేషన్ విడుదల చేసింది. ఎకరాకు కనీస ధరను రూ.175 కోట్లుగా నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయా న్ని సవాల్ చేస్తూ జువ్వాడి ప్రణయ సింహారావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ, గతంలో కంచ గచ్చిబౌలిలోని భూముల వేలాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం అవే రక్షిత భూములను వేలం వేసేం దుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తెలం గాణ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయ వాది అభిషేక్ సింఘ్వీ ఈ ఆరోపణలను తోసిపుచ్చా రు. పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన వాదించారు. ప్రస్తుతం వేలానికి ఉంచిన రాయదుర్గం భూములకు, గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు ప్రాంతాల మధ్య దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉందన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవి ంచిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాయదుర్గం భూముల వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది.

# ధర్మపురి అర్వింద్ అతితెలివిని ప్రదర్శిస్తూ మాట్లాడుతున్నారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలపై విమర్శలు చేస్తున్నారంటూ నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక అనుమతులతోనే ముఖ్యమంత్రి పర్యటనకు వెళ్లారని, దాన్ని కూడా రాజకీయం చేయడం బీజేపీ నేతల దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. లండన్‌లోని ప్రముఖ విద్యా సంస్థలు, క్రీడా ప్రాం గణాలను సందర్శించి తెలంగాణకు ఉపయోగ పడే ప్రమాణాలను సీఎం పరిశీలిస్తుంటే బీజేపీ నాయ కులకు కడుపునొప్పి ఎందుకని ఆయన ప్రశ్నించారు. అర్వింద్ అతితెలివి ప్రదర్శిస్తూ "భారత వ్యతిరేక శక్తులను కలవడానికే సీఎం వెళ్లారు" అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 2014 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ 103 విదేశీ పర్యటనలు చేసి 82 దేశాలు తిరిగారని గుర్తుచేసిన ఆది శ్రీనివాస్, ప్రధాని కూడా పనిలేక తిరిగారా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి తన మూడేళ్ల పాలనలో కేవలం రెండుసార్లు దావోస్‌కు, ఒకసారి అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలకు మాత్రమే వెళ్లారని వివరిం చారు. ఏదో రకంగా తెలంగాణలో అధికారంలోకి వస్తామన్న అర్వింద్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ... అక్రమ మార్గాల్లో అధికార ంలోకి రావడం వారికి అలవాటేనని ఆయన ఒప్పుకు ంటున్నారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని, ప్రభుత్వం జోలికి వస్తే తోకలు కత్తిరించి తాట తీస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపిస్తూ, "ఏ విధంగానైనా అధికారంలోకి వస్తాం" అన్న అర్వింద్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

# షావుకారు జానకి మరణం

షావుకారు జానకి మరణంపై మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ' ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించింది. 'షావుకారు' చిత్రంతో మొదలైన ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానం తెలుగు, తమిళంతో పాటు పలు భాషల్లో దాదాపు ఏడు దశాబ్దాలపాటు కొనసాగింది. వైవిధ్యమైన పాత్రలకు తన సహజమైన నటనతో ప్రాణం పోసి, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప నటి ఆమె. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని అన్నారు.

**ఆ పాత్రలు ఎప్పటికీ జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి: జూనియర్ ఎన్టీఆర్**

జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'తెలుగు, భారతీయ సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన షావుకారు జానకి మరణవార్త ఎంతో బాధ కలిగించింది. జానకి సినీ ప్రయాణం, ఆమె పోషించిన పాత్రలు ఎప్పటికీ మన జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు.

**తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ స్పందిస్తూ..**

'తన అద్వితీయమైన నటనతో ఎన్నో తరాల ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి అనారోగ్యంతో కన్నుమూశారనే వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి, వేదనకు గురిచేసింది. చిత్ర పరిశ్రమలో 70 ఏళ్లకు పైగా ప్రయాణించి, లెక్కలేనన్ని పాత్రలకు జీవం పోసిన ఆమె కళా సేవ ఎల్లప్పుడూ కొనియాడదగినది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ వంటి వివిధ భాషా చిత్రాలలో నటించి రికార్డు సృష్టించడంతో పాటు.. పద్మశ్రీ, కలైమామణి, నంది అవార్డులతో సహా పలు పురస్కారాలను అందుకున్న షావుకారు జానకి మరణం సినీ రంగానికి తీరని లోటు' అని అన్నారు.

## మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ నేతల తిరుగుబాటు..!

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి తీవ్ర రూపం దాల్చాయి. మంత్రి కొండ సురేఖతో పాటు ఆమె కుమార్తె సుస్మిత పటేల్‌పై సొంత పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత విషయాలలో వారి వ్యవహార శైలిపై అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేసి బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం కలకలం రేపుతోంది. మరోవైపు ఈ వివాదంపై స్పందించిన కొండ సురేఖ కుమార్తె సుస్మిత కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తలెత్తిన వివాదాలు, నేతల వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రాష్ట్రానికి వచ్చిన తర్వాతే నేరుగా మాట్లాడతానని ఆమె స్పష్టం చేశారు. సీఎంతో సమావేశమయ్యే వరకు ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని వెల్లడించారు. స్వపక్ష నేతల తీవ్ర వ్యాఖ్యలు, దానికి ప్రతిగా వినిపిస్తున్న వాదనలతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయం తీవ్ర వేడెక్కింది.

# తెలంగాణలో భూములకు రికార్డు ధర..

నిర్వహించిన భూముల ఆన్‌లైన్ వేలంలో రాయదుర్గం ప్రాంతంలో ఎకరం భూమి ఏకంగా రూ.264 కోట్లకు అమ్ముడుపోయింది. ఈ మేరకు TGIIC ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన భూము ల వేలంలో ఇది మరో రికార్డుగా నిలిచింది. టీజీఐఐసీ భూముల వేలానికి భారీ స్పందన లభించింది. టీజీ ఐఐసీలో ఎకరం భూమి ఇంత ధర పలకడం రికార్డు అనే చెప్పాలి.రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లో పాన్‌మక్తా ప్రాంతానికి చెందిన మొత్తం 5.25 ఎకరాల భూమిని TGIIC ఆన్‌లైన్ వేలానికి పెట్టింది. ఈ భూమికి ఎకరాకు కనీస ధరను రూ.175 కోట్లుగా అధికారులు నిర్ణయిం చారు. వేలంలో పాల్గొనే బిడ్డర్లకు రూ.10 కోట్ల డిపాజిట్ మొత్తాన్ని నిర్దేశించారు. భారీ విలువ కలిగిన భూమి కావడంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడి బిడ్లు దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఎకరాకు రూ. 264 కోట్ల చొప్పున లెక్కగడితే ఈ స్థలం మొత్తం విలువ రూ. 1,386 కోట్లకు చేరింది. ఇదే ప్రాంతంలో మూడు నెలల క్రితం నిర్వహించిన వేలంలో ఎకరం భూమి రూ.237 కోట్ల ధర పలికినట్లు సమాచారం. తాజాగా ఆ రికార్డును అధిగమిస్తూ రూ.264 కోట్ల ధర నమోదవడం హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ డిమాం డ్‌కు సంకేతంగా మారింది.ఐటీ కారిడార్‌కు సమీప ంలో ఉన్న రాయదుర్గం, పాన్‌మక్తా ప్రాంతాల్లో వాణిజ్య, కార్యాల య, మిశ్రమ వినియోగ అభివృద్ధికి భారీ డిమాండ్ ఉండట మే ఈ స్థాయి ధరలకు కారణంగా రియల్ ఎస్టేట్ వర్గాలు భావిస్తున్నాయి. TGIIజభూముల వేలంలో నమోదైన తాజా రికార్డు ధరతో హైదరాబాద్ భూముల మార్కెట్‌లో మరోసారి చర్చ మొదలైంది. ఈ భూమిని ఎవరు కొన్నారో తెలుసా..? ఎకరం భూమి ఇంత ధర పలుకడం, దీనిని ఎవరు కొన్నారనేదానిపై చర్చనీయాంశమైంది. రంగారెడ్డి జిల్లా రాయదుర్గం ప్రాంతంలో ఉన్న ఈ అత్యంత విలువైన స్థలాన్ని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'మీచీ రియాల్టీస్' పోటీపడి వేలంలో దక్కించుకుంది. నగరంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఎంత డిమాండ్ ఉందో తెలిసిపోతుంది.

## తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం అరుదైన పాదయాత్రే నిదర్శనం.!

కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ సామాన్యులు సైతం స్వచ్ఛందంగా కదిలివస్తున్న వైనం రాష్ట్రవ్యాప్తంగా అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. అదిలాబాద్ జిల్లా వాంకిడికి చెందిన ఆటో డ్రైవర్ తిరుపతి, కార్మికుడు శంకర్ ల ఉదంతం ఇందుకు తాజా నిదర్శనం. కేసీఆర్ మళ్ళీ సీఎం పీఠంపై కూర్చోవాలనే ఏకైక లక్ష్యంతో వారు సాగించిన సాహసయాత్ర అసాధారణమైనది. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకోవడానికి వారు ఏకంగా 300 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. ఎండను, వడగాల్పులను లెక్కచేయకుండా, 11 రోజుల పాటు రోజుకు సగటున 25 కిలోమీటర్ల చొప్పున కాలినడకన ప్రయాణించి వారు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఒక సామాన్య ఆటో డ్రైవర్, కార్మికుడు తమ దైనందిన బతుకుపోరాటాన్ని పక్కన పెట్టి, కేవలం రాష్ట్ర భవిష్యత్తు కోసం, కేసీఆర్ నాయకత్వం మళ్ళీ రావాలని ఇంత దూరం పాదయాత్ర చేయడం తెలంగాణ ప్రజల గొంతుకలో కేసీఆర్ పై ఉన్న అపారమైన నమ్మకానికి అద్దం పడుతోంది. ఎర్రవల్లి చేరుకున్న ఆ ఇద్దరు వీరులను కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ, వారిలో ఆత్మస్థైర్యం నింపారు. ప్రజా సమస్యలపై నిరంతరం తపించే కేసీఆర్ గొప్ప మనసుకు, సామాన్యుల పట్ల ఆయన చూపించే ఆప్యాయతకు ఈ కలయిక మరో ప్రతీకగా నిలిచింది. తెలంగాణ నేల పునరుజ్జీవనం పొందాలన్నా, రాష్ట్రం మళ్ళీ ప్రగతి పథంలో పరుగులు పెట్టాలన్నా అది కేసీఆర్ తోనే సాధ్యమని రాష్ట్ర ప్రజలు మరోసారి గట్టిగా విశ్వసిస్తున్నారు. ఆప్యాయతలను పంచుతూ, ప్రజాక్షేమమే ఊపిరిగా సాగుతున్న కేసీఆర్ నాయకత్వం కోసం తెలంగాణ ప్రజల గుండెలు ఎంతగా పరితపిస్తున్నాయో ఈ చారిత్రక పాదయాత్ర స్పష్టం చేస్తోంది!

## కబ్జాకోరులకు మల్కాజ్‌గిరి మహిళా సీపీ షాక్..

హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు భూకబ్జాదారుల చెర నుంచి తన రూ. 40 కోట్ల విలువైన ఆస్తిని దక్కించుకున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) సుమతి చొరవతో ఆమెకు సకాలంలో న్యాయం చేకూరింది. రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా నిందితులపై కఠినంగా వ్యవహరించి, వృద్ధురాలికి బాసటగా నిలిచిన సీపీపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన సదరు మహిళకు సుమారు రూ. 40 కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. దశాబ్దాలుగా ఆ భూమి ఆమె స్వాధీనంలోనే ఉన్నప్పటికీ, ఇటీవల కొందరు భూకబ్జాదారులు ఆ ఆస్తిపై కన్నేశారు. అక్రమంగా స్థలంలోకి చొరబడి, అది తమదేనంటూ సదరు వృద్ధురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ ధైర్యంతో మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించారు. తన భూమికి సంబంధించిన అన్ని దస్తావేజులను సమర్పించి, న్యాయం చేయాలని ఆమెను అభ్యర్థించారు. వృద్ధురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన సీపీ సుమతి, సమగ్ర విచారణకు ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఆ భూమి బాధితురాలిదేనని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల ద్వారా కబ్జాదారులు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయినప్పటికీ సీపీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ స్థలం తమదేనని వాదిస్తున్న వారిని పిలిపించి ఆధారాలు సమర్పించాలని ఆదేశించారు. వారు సరైన పత్రాలను చూపలేకపోవడంతో, ఆ భూమి వృద్ధురాలిదేనని అధికారులు తుది నిర్ధారణకు వచ్చారు. కోట్లాది రూపాయల విలువైన తన ఆస్తి తిరిగి దక్కడంతో ఆ వృద్ధురాలు హర్షం వ్యక్తం చేశారు. సీపీ సుమతి ప్రదర్శించిన చొరవను, వృత్తిపరమైన నిబద్ధతను స్థానికులు కొనియాడుతున్నారు. భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## హైకోర్టులో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ..

పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావం కారణంగా తెలంగాణలోూ ఆగస్టు 21 నుంచి ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, పోలవరం ప్రాంతాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తా జిల్లాల్లో చెదురుమదురు జల్లులు పడతాయని వివరించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

# ఆటో, క్యాబ్ డ్రైవర్ల రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ

తెలంగాణ పత్రిక దమ్మపేట ఆగస్టు 21

దమ్మపేట: రాష్ట్రంలో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఈ నెల 23 అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరగబోయే ఆటో, క్యాబ్ డ్రైవర్ల రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. శుక్రవారం దమ్మపేటలోని ఆటో అడ్డా వద్ద నిర్వహించిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు ఇస్తామని ప్రకటించిన రూ.12,000 సహాయం గురించి ఆలోచించే తీరిక కూడా ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం తగదని పేర్కొన్నారు. అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతోనే గత్యంతరం లేక నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.



**ప్రధాన డిమాండ్లు:**

రవాణా సంస్థకు ఆటోలను అనుసంధానం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. మోటారు రంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. ప్రైవేటు రవాణా యాప్‌ల వల్ల ఆటో డ్రైవర్లు ఆర్థికంగా నష్టపోతున్నందున, ప్రభుత్వమే సొంతంగా రవాణా యాప్‌ను అందుబాటులోకి తెచ్చి ఆదుకోవాలి. చట్ట విరుద్ధంగా వైట్ ప్లేట్లతో నడుపుతున్న ద్విచక్ర వాహనాల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలి. త్రీ వీలర్ లైసెన్సులను తేలికపాటి మోటారు వాహన (ఎల్ఎమ్‌వీ) లైసెన్సులుగా మార్చే క్రమంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలి. అర్హులైన ఆటో కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, నివేశన స్థలాలు మంజూరు చేయాలి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, ఆటో కార్మికుల సంఘం నాయకులు విక్రమ్, బాలయ్య, వెంకట్, రవి, శ్రీను, బుచ్చిరాజు, రాజశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు: మౌనంలో మునిగిన అధికారులు!

-అక్రమ సెల్లార్లు నిర్మాణాలు
-కలెక్టర్ గారు స్పందించాలి

చుంచుపల్లి ,ఆగస్టు 22(తెలంగాణ పత్రిక)

విద్యానగర్ కాలనీ పంచాయతీ పరిధిలోని చారిత్రాత్మక చింతలచెరువు కట్ట చుట్టూ అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని సెల్లార్ల తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చెరువుల సంరక్షణకు నిర్దేశించిన బఫర్ జోన్ నిబంధనలను బొందపెడుతూ, కమర్షియల్ కాంప్లెక్స్‌లు వెలుస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత తీవ్రతను మరిచిన యంత్రాంగం గతంలో భారీ వర్షాలు, వరదల తాకిడికి ఇదే చెరువు కట్ట తెగి విద్యానగర్, ఎంకే నగర్ పంచాయతీ పరిధిలోని నివాస ప్రాంతాలు ముంపునకు గురైన చేదు అనుభవాలు ఉన్నాయి. వరద నీటి ప్రవాహానికి అనేక ఇళ్లు దెబ్బతిని, ప్రజలు రోడ్డున పడ్డ సందర్భాలు స్పష్టంగా కళ్లముందు కనిపిస్తున్నా అధికారులు పాఠాలు నేర్వకపోవడం గమనార్హం. ప్రకృతి ప్రకోపానికి మళ్లీ అవకాశమిచ్చేలా చెరువు బఫర్ జోన్‌లోనే భారీ



సెల్లార్లు తవ్వుతూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తుంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినా కదలని మెలిక ఈ అక్రమ నిర్మాణాలపై పలు దినపత్రికల్లో విస్తృతంగా వార్తలు వచ్చినా, బాధ్యత కలిగిన అధికారులు కనీసం క్షేత్రస్థాయి పరిశీలనకు కూడా రాకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'ముడుపులు' ముట్టినట్లు ప్రత్యక్ష ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను పక్కనబెట్టి అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న ఆ నామమాత్రపు అధికారుల తీరు వెనుక



అసలు మర్మమేమిటని విద్యానగర్ వాసులు ప్రశ్నిస్తున్నారు.

**కలెక్టర్ గారు స్పందించాలి!**

భవిష్యత్తులో మళ్లీ వరద ముప్పు ఏర్పడితే వందలాది కుటుంబాల ప్రాణాలకు, మూగజీవాలకు, ఆస్తులకు ఎవరు బాధ్యత వహిస్తారు? ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు తక్షణమే జోక్యం చేసుకుని, బఫర్ జోన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువు కట్టను వినాశనం నుంచి కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నాంపల్లి గుట్టపై సుందరీకరణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



-ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం, ఇతర పనులపై అధికారులకు సూచనలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, తెలంగాణ పత్రిక

వేములవాడ అర్బన్ మండలం నాంపల్లిగుట్టపై వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ(వీ టీ ఏ డీ ఏ) ఆద్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. వీటీఏడీఏ ఆద్వర్యంలో నాంపల్లి గుట్టపై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఇక్కడికి తరలించారు. విమానం ఏర్పాటు చేసే, ఇతర సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆ పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. విమానం ఏర్పాటు, సుందరీకరణ పనులను గడువులోగా పూర్తి చేసి.. భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ పూజలు**

నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికారు. స్వామి వారికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు అందజేసి.. ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్ జయంత్ కుమార్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# బీకొండ నారాయణ కుటుంబానికి పద్మశాలి సంఘం ఆర్థిక సహాయం

పాపన్నపేట,ఆగస్టు 21:(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన ఏడుపాయల దేవస్థానం మాజీ డైరెక్టర్,పద్మశాలి సంఘం నాయకులు బీకొండ నారాయణ గురువారం రోజు అనారోగ్యంతో అకాల మరణం చెందాడు. ఈవిషయం తెలుసుకున్న పద్మశాలి సంఘం నాయకులు శుక్రవారం రోజు ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.5000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొడపాక విట్టల్,ఉపాధ్యక్షులు పల్లె సంగమేశ్వర్ పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పద్మశాలి సంఘం నాయకులు, బంధువులు ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



# వేములవాడ రూరల్ ఎస్సైగా ప్రశాంత్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

వేములవాడ రూరల్,21, తెలంగాణ పత్రిక.




వేములవాడ రూరల్ ఎస్సైగా ప్రశాంత్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కోనరావుపేట పోలీస స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వేములవాడ రూరల్ కి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. వేములవాడ రూరల్ మండలం లో శాంతి భద్రతల పరిరక్షణ, రౌడీ ల పై నిఘా, ట్రబుల్ మంగర్స్ ల పై నిఘా, గంజాయి పై ప్రత్యేక టీమ్ తో నిఘా పెట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయటం జరుగుతుంది అని , ఫిర్యాదు లపై సత్వర చర్యలు తీసుకోవటం జరిగింది అని, అసంఘిక కార్యకలాపాలు చేసేవారిపై కఠిన చర్యలు ఉంటాయి అని, చట్ట పరిధి దాటకుండా ఉండాలి అని ప్రజలకు సూచించారు.

# ఇల్లంతకుంట ఎస్ఐ సిరిసిల్ల అశోక్‌కు ఘన వీడ్కోలు




ఇల్లంతకుంట ఆగస్టు 21 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సిరిసిల్ల అశోక్ బదిలీపై తంగళ్ళపల్లి కి వెళ్తున్న సందర్భంగా ఆయనకు ఘన వీడ్కోలు పలికారు. శుక్రవారం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను సిబ్బంది కొనియాడారు. ఆయన విధి నిర్వహణలో ఎంతో నిబద్ధత చూపారని అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇల్లంతకుంట ఎస్సైగా ధ్యతలు చేపట్టిన ఉపేంద్ర చారి

ఇల్లంతకుంట ఆగస్టు 21 తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా సాధారణ బదిలీల్లో భాగంగా తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బదిలీ అయిన ఎస్ఐ ఉపేంద్ర చారి శుక్రవారం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ ఎస్సై గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి, బుగ్గారం, మల్యాల పోలీస్ స్టేషన్లతో పాటు కరీంనగర్ లోని చొప్పదండి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సిరిసిల్లలోని తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉపేంద్ర చారి మాట్లాడుతూ... ప్రజల సహకారంతో మండలంలో శాంతిభద్రతలను కాపాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. ఎవరికైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని, తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడి రాజు, ప్యాక్స్ డైరెక్టర్ ఒగ్గు రమేష్‌కు ఘన సన్మానం

ఇల్లంతకుంట ఆగస్టు 21 తెలంగాణ పత్రిక



ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన మామిడి రాజును, ప్యాక్స్ డైరెక్టర్‌గా నియమితులైన ఒగ్గు రమేష్ ను శుక్రవారం ఇల్లంతకుంట గౌడ సంఘం భవనంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ సభ్యులను ఉద్దేశించి మామిడి రాజు మాట్లాడుతూ. ఇల్లంతకుంట గ్రామ గౌడ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇల్లంతకుంట శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద కమాన్ (ఆర్చ్) ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన గీతా కార్మికులందరూ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు,

# మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది

**-కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగాలి**
**-కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**

జగిత్యాల, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):



మెట్‌పల్లి మైనారిటీ పాఠశాల మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులతో ఎమ్మెల్యే మాటాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసం వారి లక్ష్యాలు భవిష్యత్ ఆశయాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమ శిక్షణతో పాటు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు ఇతర సృజనాత్మక రంగాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు."మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది". కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి మీ తల్లిదండ్రులకు పాఠశాలకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలి" అని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలల అవసరాలు విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు.

# జిల్లా కార్యవర్గ సభ్యుడుగా రామడుగు వెంకటేష్ నియామకం

ఓదెల ఆగస్టు 21 తెలంగాణ పత్రిక



ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఓదెల గ్రామానికి చెందిన అమాలి కార్మికుడు రామడుగు వెంకటేష్ ఎన్నికైనట్లు ప్రకటించారు ఈ సందర్భంగా ఏఐ టి యు సి పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభ సుల్తానాబాద్ లోని యశోద నరహరి ఫంక్షన్ హాల్ లో భారీ ఎత్తున నిర్వహించారు ఈ సందర్భంగా ఓదెల మండల కేంద్రానికి చెందిన హమాలి కార్మిక సంఘ నాయకుడు రామడుగు వెంకటేష్ ను పెద్దపెల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు ఈ సందర్భంగా రామడుగు వెంకటేష్ తెలంగాణ పత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ నాకు ఈ అవకాశం రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు అమాలి కార్మిక హక్కుల కోసం హమాలి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం వెన్నంటి ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు అంతేకాదు నా మీద నమ్మకంతో నాకు ఈ బాధ్యతలు అప్పగించారని మండలంలో ఉన్న హమాలి కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మండల మరియు జిల్లా నాయకులతో సంప్రదించి సమస్య పరిష్కరించేందుకు తమ వంతు తప్పకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన కొడంగల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు నాలుగు మండలాల పార్టీ సమస్యలపై ఎన్. రామచంద్రరావుతో చర్చ



కొడంగల్, ఆగస్టు 21( తెలంగాణ పత్రిక):

కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్, దుద్యాల, కొడంగల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన బీజేపీ నాయకులు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును కలిశారు. ఆయా మండలాల్లో పార్టీకి సంబంధించిన సమస్యలు, సంస్థాగత అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించారు. ఈ కార్యక్రమంలో బొంరాస్‌పేట్ మండల అధ్యక్షుడు ఉప్పరి జగదీశ్వర్ సాగర్‌తో పాటు సి. అంజి, తప్పు జనార్ధన్, జి. సతీష్, రాజారాం రెడ్డి, మహేందర్ గౌడ్, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. దుద్యాల మండల అధ్యక్షుడు గొల్ల నారాయణ యాదవ్, గోవిందరాజు, శ్రీకాంత్, దత్తు, సంజు, శ్వేత గౌడ్, వెంకటేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరేష్, బాలకృష్ణ, అంజి తదితరులు హాజరయ్యారు. కొడంగల్ మండలం నుంచి కే. మహేష్ బాబు, రామకృష్ణ, బి. ప్రవీణ్ తదితరులు, దౌల్తాబాద్ మండలం నుంచి కే. అశోక్, ఏ. మోహన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

**-భూసేకరణ కోసం రూ.2,800 కోట్లు విడుదలకు ఆమోదం**
**-జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్**
**-హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, తెలంగాణ పత్రిక

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.



భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. నిధులు అందుబాటులో ఉన్నందున భూసేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.కొత్త ఆయకట్టు సృష్టించేందుకు అవసరమైన భూసేకరణతో పాటు పునరావాస పనులను కూడా వేగవంతంగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులకు భూసేకరణ కారణంగా ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



**పెండింగ్ పనులు పూర్తి చేయాలి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి, మధ్య మానేరు, కాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే.ఎస్.బీ. కుమారి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి దయాకర్, ఎస్‌డీసీ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి ప్రశాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఒఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

**-కారు డి కొని గార్డెన్ కార్మికుడు నవీన్ రాజు అక్కడికక్కడే మృతి**
**-శంషాబాద్ పెద్ద గోల్కొండ వద్ద ఘటన.**
**-కాంట్రాక్టర్ పై కార్మికుల ఆగ్రహం.**
**-ఒఆర్ఆర్‌పై కార్మికుల తీవ్ర ఆందోళన .**

రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 21 తెలంగాణ పత్రిక.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డుపై విషాదం చోటుచేసుకుంది. గార్డెన్ పనులు చేస్తున్న కార్మికుడు నవీన్ రాజును వేగంగా వచ్చిన కియా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ రాజు తీవ్ర గాయాల పాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. నవీన్ రాజు మృతికి కారకుడైన కియా కార్ డ్రైవర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్డుపై ఆందోళనకు దిగారు.మృతదేహాన్ని



తరలించేందుకు కార్మికులు నిరాకరించారు.గార్డెన్ కాంట్రాక్టర్ వెంటనే సంఘటన స్థలానికి రావాలని మొండికేశారు.

**కాంట్రాక్టర్ పై కార్మికుల ఆగ్రహం**

సంవత్సరాలుగా ఓఆర్ఆర్ గార్డెన్ పనుల్లో కార్మికులుగా పనిచేస్తున్న తమకు ఎలాంటి భరోసా లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ పై మితిమీరిన వేగంతో వెళుతున్న వాహనాలు మమ్మల్ని ఢీ కొట్టి మా ప్రాణాలు తీస్తున్నాయి. కాంట్రాక్టర్ మాత్రం మా గురించి పట్టించుకోవడం లేదు. మాకు ఇన్సూరెన్స్, ఐడి కార్డ్, సరైన వేతనం, ఇవ్వరు. సరైన సమయం కేటాయించారు, మా



కష్టాన్ని దోచుకుంటున్నారు. ప్రాణాలు పోయిన కూడా పట్టించుకోరు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ వచ్చి తమకు భరోసా ఇచ్చేవరకు న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని తోటి కార్మికులు స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎంపీ రఘునందన్ రావును కలిసిన పాపన్నపేట బిజెపి నూతన కార్యవర్గం

పాపన్నపేట, ఆగస్టు 21:(తెలంగాణ పత్రిక)

మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావును పాపన్నపేట మండల బిజెపి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అధ్యక్షుడు సంతోష్ చారి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన బిజెపి మోర్చాల అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు ఎంపీ ని కలిసి ఏడుపాయల వనదుర్గామాత జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సంతోష్ చారి మాట్లాడుతూ.. పాపన్నపేట మండలంలోని పలు సమస్యలను ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎంపీ సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.



అనంతరం ఎంపీ రఘునందన్ రావు నూతన మండల కమిటీ, మోర్చాల అధ్యక్షులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, కార్మిక సెల్ సెక్రటరీ సంతోష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిలు లక్ష్మణరావు,



నాగభూషణం, మండల ఉపాధ్యక్షుడు బొక్కల భాగేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వడ్ల భాగేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జిన్న గోపాల్, యువ మోర్చా అధ్యక్షుడు జగదీష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మన్నె సుమలత, అధ్యక్షుడు బాబు, ఎస్పీ మోర్చా అధ్యక్షుడు వెంకట్ నాయక్, బీజేవైఎం శ్రవణ్, బూత్ అధ్యక్షుడు సాయిలు, మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి నాయికోటి మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల మార్పుకు-తల్లిదండ్రులు సహకరించాలి

**-శ్రీ గ్రీన్ వుడ్ స్కూల్ కరస్పాండెంట్ మిట్టపల్లి మహేష్ రెడ్డి**

రాయికల్ మండల ఆగస్టు21 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లారాయికల్ మండల కేంద్రంలోని శ్రీ గ్రీన్ వుడ్ ఉన్నత పాఠశాలలో నల్గొండ జిల్లాలో ప్రిన్సిపల్ రూప రెడ్డి నీ విద్యార్థులే హత్య చేయడం బాధాకరం దానికి నిరసనగా పాఠశాలలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రిన్సిపల్ రూపరెడ్డిని హత్య చేసింది విద్యార్థులు అని తేలడంతో



సమాజం ఒక్కసారి ఉలిక్కిపడిందని, ఈ సంఘటన ప్రస్తుతం పిల్లల మానసిక ప్రవర్తన ఆందోళనలు తెలియజేస్తుందని, ఒకప్పుడు టీచర్ అంటే స్టూడెంట్ కి భయం ఉండేది ఎంత దండించిన ఎదురు తిరిగేవారు కాదు కానీ ఇప్పుడు ఒక్క మాట అన్న పడటం లేదు. పిల్లలు పెరుగుతున్న తరుణంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని, పిల్లల్లో ఈ ప్రవర్తనను మార్చాల్సింది పేరెంట్స్ అని దానికి పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయల బృందం, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి టెంపుల్‌లో ఘనంగా వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అన్నప్రసాదం, స్వీట్ల పంపిణీ

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, తెలంగాణ పత్రిక

వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం శక్తి టెంపుల్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాత, దుర్గామాత, సరస్వతీ మాతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. వ్రతం అనంతరం ఆలయ ప్రాంగణంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, ప్రజలకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో వడ్డించారు. అలాగే స్వీట్లను పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వరలక్ష్మి వ్రతం వంటి పవిత్రమైన రోజున అన్నప్రసాదం పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సమాజంలో ఆధ్యాత్మికతతో





పాటు సేవాభావాన్ని పెంపొందించవచ్చన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాన్ని భక్తులు అభినందిస్తూ నిర్వాహకులను ప్రశంసించారు. వరలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆవుల లక్ష్మారెడ్డి, కొనుకటి తిరుపతి, లక్ష్మి, కొనుకోటి సూర్యకాంత్, నాగరాజు, సాన్విక రెడ్డి, బాల లక్ష్మి, శివ, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నూతన కార్యాలయ భవనాలతో ప్రజలకు మెరుగైన సేవలు - రాష్ట్ర గృహ రెవిన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు







జగిత్యాల, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లాలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మానాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జగిత్యాల జిల్లాలో విస్తృతంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ వయోవృద్ధులు వికలాంగుల ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సిసిఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ స్పెషల్ సెక్రటరీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి శంకుస్థాపనలో పాల్గొన్నారు. జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు భీమారం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల అంచన వ్యయంతోఎండపల్లి తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి 2.25 కోట్ల నిధులు మాల్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి 1.40 కోట్ల అంచనా వ్యయంతో మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు మొత్తంగా ఆరు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి 11.80 కోట్ల అంచన వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు భీమారం ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు మాల్యాల మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు నిర్వహించారు. ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనాలను నిర్మించడం ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను సులభంగా అందించడానికని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు అధికారులు సిబ్బంది సమర్ధవంతంగా విధులు నిర్వహించేందుకు అనువైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన భవనాల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో కూడిన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. రెవెన్యూ రిజిస్ట్రేషన్ తదితర శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేల ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. జిల్లాలో పరిపాలన సౌకర్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన సమర్ధవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యుడు ఎల్. రమణ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు అదనపు కలెక్టర్లు బి.ఎస్ లత రాజగౌడ్ జగిత్యాల జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంఘనభట్ల దినేష్ డీసీసీ ప్రెసిడెంట్ గాజంగి నందయ్య జగిత్యాల మెట్పల్లి కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్ నరసింహరావు జీవాకర్ రెడ్డి జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ కోరుట్ల మున్సిపల్ చైర్మన్ రాయికల్ మున్సిపల్ చైర్మన్లు ఆయా మండలాల స్థానిక ప్రజా ప్రతినిధులు జిల్లా స్థాయి అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# కలశ్ వందన్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

-బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ పిలుపు

జగిత్యాల, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):

సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సమరసత సంకల్ప్ అభియాన్'లో భాగంగా చేపట్టనున్న 'కలశ్ వందన్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో 'కలశ్ వందన్ అభియాన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. రాచకొండ యాదగిరి బాబు మాట్లాడుతూ సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్




బోధనలు సమాజానికి మార్గదర్శకమని కుల వర్గ భేదాలకు అతీతంగా సమాజంలో ఐక్యత సోదరభావం సామరస్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు. రవిదాస్ మహారాజ్ చూపిన సమరసత మార్గాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నారపాక అశోక్ మాట్లాడుతూ కాశీలోని సంత్ రవిదాస్ మహారాజ్ జన్మస్థల పవిత్ర క్షేత్రం నుంచి సేకరించిన మట్టితో పూజించిన పవిత్ర కలశాలను దేశంలోని అన్ని రాష్ట్రాలకు పంపించినట్లు తెలిపారు. తెలంగాణకు చేరిన పవిత్ర కలశాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాలకు తీసుకెళ్లి ప్రతి ప్రాంతానికి సంత్ రవిదాస్ మహారాజ్ సందేశాన్ని చేరవేసేల కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణలోని 33 జిల్లాలకు పవిత్ర కలశాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అశోక్ తెలిపారు.

# పెద్దాపూర్‌లో చోరీ.. ఇంటికి నిప్పు పెట్టిన నిందితుడి అరెస్ట్

- రూ.2.42 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం
- సీఐ సంతోష్



ఆత్మకూర్, ఆగస్టు 21: (తెలంగాణ పత్రిక):

మండలంలోనిపెద్దాపూర్ గ్రామంలో ఇంట్లో చోరీకి పాల్పడి, నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇంటికి నిప్పు పెట్టిన కేసులో నాగనబోయిన శివరాజ్ (22)ను అరెస్ట్ చేసినట్లు ఆత్మకూర్ సీఐ సంతోష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న రాత్రి పెద్దాపూర్‌కు చెందిన నాగనబోయిన రవి ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన శివరాజ్ తలుపును తొలగించి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, 42 తులాల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదును అపహరించినట్లు తెలిపారు. అనంతరం తనపై అనుమానం రాకుండా, నేరాన్ని మరొకరిపైకి మళ్లించే ఉద్దేశంతో ఇంట్లోని సంచికి నిప్పంటించి ఇంటికి నిప్పు పెట్టినట్లు విచారణలో వెల్లడైందన్నారు. చోరీ చేసిన ఆభరణాలను విక్రయించేందుకు వరంగల్ వైపు వెళ్తున్న సమయంలో ఈ నెల 21న అక్కంపేట సమ్మక్క ఆర్చ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించాడని, అప్రమత్తమైన పోలీసులు అతడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారని సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.80 లక్షల విలువైన మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.42 వేల విలువైన 42 తులాల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదు, మొబైల్ ఫోన్, హోండాద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం పరకాల కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

# న్యాయ కళాశాల ఏర్పాటుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

-GSP రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర

వెంకటాపురం. (నూగురు). ఆగస్టు 21 : తెలంగాణ పత్రిక: :



వెంకటాపురం మండల కేంద్రమైన ఆర్ఎంబి.గెస్ట్ హౌస్ ఆవరణంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం+త్రా జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో +త్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటుకు ఒక ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. 5వ షెడ్యూల్ భూభాగమైన భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తే ఆదివాసి యువతకు రాజ్యాంగంలో ఆదివాసులకు కల్పించిన హక్కులు చట్టాలపై అవగాహనతో న్యాయవిద్య ఎంతో అవసరమని అన్నారు స్వాతంత్రం వచ్చినేటికీ 80 ఏళ్లు అవుతున్నప్పటికీ కూడా ఆదివాసి చట్టాలు అమలుకు నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి చట్టాలను జీవోలను ఏజెన్సీ ప్రాంతంలో బూర్జవ గిరిజనేతరుల పార్టీలు అమలు కాకుండా అడ్డు పడుతున్నారని ఆదివాసి చట్టాలు జీవోలు పటిష్టంగా అమలు కావాలంటే భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చెయ్యవలసిందేనని ఆయన అన్నారు. 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోకి 1/70 చట్టానికి విరుద్ధంగా వలసలు పెరిగిపోతున్నాయని వలసలు పెరిగిపోవడంతో ఆదివాసీలు మైనార్టీలో పడిపోయే ప్రమాదం ఉందని అందుకే ఏజెన్సీ ప్రాంతంలో వలస నిరోధిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు కావాలంటే ఏజెన్సీ ప్రాంతలలో పిసా చట్టం ప్రకారం గా పిసా గ్రామ సభలు నిర్వహించి 1/70 కి విరుద్ధంగా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నగిరిజనేతరులను ఏజెన్సీ ప్రాంతాలనుండిమైదాన ప్రాంతానికి తరలించాలని. పిసా గ్రామ సభలలో తీర్మానాలు తక్షణమే చేయాలని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో శ్రీ కోనేరు రంగారావు. కమిటీ సిఫార్సులు. పటిష్టంగా అమలు చేయవలసిన బాధ్యత అధికారులపై ఉందని కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులప్రకారం గా ఏజెన్సీ ప్రాంతంలో భూమిపై నీటిపై అడవిపై సర్వహక్కులు ఆదివాసీలకే చెందుతాయని కోనేరు రంగా రావు. కమిటీ సిఫార్సులు చెబుతుంటే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు భూకబ్జాలు ప్రభుత్వ భూములను మరియు ఆదివాసీల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తుంటే అది ఇంతవరకు సమంజసమని ఆయన అన్నారు భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని త్వరలో 100 రోజుల దండయాత్ర కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పదం సుధాకర్. సురేష్ .రాజబాబు. సత్యనారాయణ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## బొంరాస్ పేట్ లో కొత్త పంచాయతీ భవనానికి భూమిపూజ

-గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం.. మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు



బొంరాస్ పేట్ ఆగస్టు 21,( తెలంగాణ పత్రిక):

గ్రామపంచాయతీ పాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. బొంరాస్పేట గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ వీరేశలింగంతో కలిసి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేష్ రెడ్డి, విబిజిరాంజీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ మౌలిక వసతులను మెరుగుపరుస్తోందన్నారు. నూతన గ్రామపంచాయతీ భవనం అందుబాటులోకి రావడంతో ప్రజలకు పంచాయతీ సేవలు మరింత సులభంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన భవన నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, నిర్మాణ సిబ్బందికి సూచించారు. గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తయితే పాలనాపరమైన కార్యకలాపాలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో పాటు ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నందిని నరేందర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తానూర్ పంచాయతీ కార్యదర్శుల యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



తానూర్:21ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండల పంచాయతీ కార్యదర్శుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా: జాదవ్ గోపీనాథ్, గౌరవ అధ్యక్షుడిగా: నానా రవికాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా: తిరుపతి రెడ్డి, కరుణ పవార్, జనరల్ సెక్రటరీగా: మొహమ్మద్ షఫీ, గౌరవ సలహాదారులుగా: శ్రీనివాస్ గౌడ్, అబ్దుల్ అజీజ్, కోశాధికారిగా: భరత్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా జాదవ్ జీవన్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఎంపీడీవో శ్రీధర్, ఎంపీఓ అమీర్ ఖాన్ సన్మానించి అభినందనలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంక్షేమం, ఐక్యత కోసం సంఘటితంగా పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## విద్య ప్రమాణాలు మెరుగుపరచాలి

-డీఐఈవో పరశురాం



ముధోల్:21ఆగస్టు(తెలంగాణ పత్రిక)

విద్యార్థుల విద్య ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా డీఐఈవో పరశురాం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగ్స్, షూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం, నోట్స్ పుస్తకాలను పరిశీలించి పలు సూచనలు అందజేశారు. సబ్జెక్టులను గడువులోగా పూర్తిచేసి, ప్రాక్టికల్స్ సకాలంలో చేయించాలన్నారు. దీంతో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట ఇంచార్జ్ ప్రిన్సిపల్ రహమాన్, అధ్యాపకులు గంగాధర్, శ్రీనివాస్, నారాయణ, శంషాద్దీన్, స్వరూప, సురేష్ లు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల అక్రమాలపై ప్రశ్నించిన జనసేన పార్టీ నాయకులు అక్రమ అరెస్టులు

-మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన సందర్భంగా జనసేన నాయకుల నిరసన జ్వాలలు





జగిత్యాల టౌన్, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):

జగిత్యాల నూకపల్లి డబుల్ బెడ్రూమ్ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో జరుగుతున్న అవకతవకలు ప్రజా సమస్యలపై ప్రశ్నించిన జనసేన పార్టీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని జనసేన నాయకులు తీవ్రంగా ఖండించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జగిత్యాల పర్యటన సందర్భంగా జగిత్యాల జిల్లా నాయకుడు బెక్కం జనార్దన్ ఆధ్వర్యంలో జగిత్యాల జనసేన పార్టీ నాయకులు కార్యాకర్తలు నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా శివారెడ్డి పాల్గోని మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను పోలీసు బలగాలతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖుని చేయడమే అని అన్నారు. జగిత్యాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో జరుగుతున్న అవకతవకలపై ప్రశ్నించినందుకే తమను తమ నాయకులను అరెస్టు చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటించాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న సమయంలో ప్రజల సమస్యలను వినాల్సింది పోయి ప్రశ్నించే నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రాంతానికి సమీపంలో డంపింగ్ యార్డ్ ఉండటంతో అక్కడ నివసించే పేద కుటుంబాల ఆరోగ్యం పారిశుధ్యం పర్యావరణం పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు ఇళ్లు నిర్మించి పక్కనే చెత్త కుప్పలు ఉంటే వారికి సురక్షితమైన జీవనం ఎలా సాధ్యం? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బెక్కం జనార్దన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రశ్నించడం తమ బాధ్యత అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులను వివరణ అడగడానికి వచ్చిన తమపై అక్రమ అరెస్టులు చేసి ప్రజాస్వామ్యాన్ని అణచివేయడం సరికాదన్నారు. జగిత్యాల పట్టణంలో అనేక ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నామని డంపింగ్ యార్డ్ సమస్య రోడ్ల సమస్యలు మౌలిక వసతుల కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని జనార్దన్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని అక్రమ అరెస్టులతో తమ పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. జనసేన నాయకులు బొల్లి రాము బొల్లి లక్ష్మణ్ గట్ల శ్రీకర్ గాజుల సంకీర్తన్ ఠాకూర్ కిరణ్‌సింగ్ బొల్లి లక్ష్మణ్ బెక్కం ప్రవీణ్ ఎడమల జైపాల్‌రెడ్డి బత్తిని బాబు కనికుట్ల నరేష్ తీట్ల రాజేందర్ తదితరులు ఉన్నారు.

## నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో లబ్ధిదారులకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం

- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

-రోడ్లు సెల్ టవర్ నీటి వసతులు పాఠశాల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి హామీ





జగిత్యాల, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):

జగిత్యాల నూకపల్లి 2 బీహెచ్‌కే గృహ సముదాయంలో నివసిస్తున్న లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండ తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. నూకపల్లి 2 బీహెచ్‌కే గృహ సముదాయాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ వయోవృద్ధులు వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సి.సి.ఎల్.ఏ. కమిషనర్ లోకేష్ కుమార్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు హౌసింగ్ ఎం.డి గౌతమ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌లతో కలిసి మంత్రి పరిశీలించారు. మిషన్ భగీరథ ట్యాంక్ పైకి వెళ్లి అక్కడి నుంచి నూకపల్లి గృహ సముదాయాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి కాలనీలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో ఇళ్లతో పాటు అవసరమైన మౌలిక వసతుల పనులను కూడ చేపట్టినట్లు మంత్రి తెలిపారు. 160 ఇళ్ల ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు వాటర్ డ్రెయిన్ సీవరేజ్ లైన్ల నిర్మాణానికి రూ.52.57 లక్షలు మంజూరు చేసి రూ.51.09 లక్షలు వ్యయం చేశారని తెలిపారు. 360 ఇళ్ల ప్రాంతంలో ఇదే తరహా పనులకు రూ.99.25 లక్షలు మంజూరు చేసి రూ.88.48 లక్షలు వ్యయం చేసినట్లు వివరించారు. 4,000 ఇళ్ల ఫేజ్-2 ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు సీవరేజ్ లైన్లు ఇన్‌స్పెక్షన్ చాంబర్లు వాటర్ డ్రెయిన్లు మెయిన్ డ్రెయిన్ అంతర్గత డ్రెయిన్ల నిర్మాణానికి రూ.11.30 కోట్ల మేర నిధులు మంజూరు కాగా 10.81 కోట్ల మేర వ్యయం చేసినట్లు తెలిపారు. 4,000 ఇళ్ల ప్రాంతంలో విద్యుత్ లైన్లు ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డుల ఏర్పాటుకు 6.05 కోట్లు మంజూరు చేసి రూ.5.01 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. 4,000 ఇళ్ల ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు సీవరేజ్ లైన్లు సీసీ రోడ్లు డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు డ్రెయిన్ల పనులకు 5 కోట్లు మంజూరు చేసి 4 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు. 4,520 ఇళ్లకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా పనులు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. కాలనీలో ఇప్పటికే పలు మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని మిగిలిన అవసరాలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి







-డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 21

పాల్వంచ మండలంలో నిర్మిస్తున్న కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న వివిధ బ్లాకులను కలెక్టర్ పరిశీలించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆయా పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల మేరకు నాణ్యతతో చేపట్టడంతో పాటు, ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం వైద్య కళాశాల ప్రధాన భవనాలు, హాస్టల్ భవనాలు,ఆసుపత్రి,తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న అంతర్గత రహదారులు, లైబ్రరీ, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, విద్యార్థుల వసతి తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రతి సంవత్సరం 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాలలో బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వసతి, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూరుతున్నాయా, ఇంకా ఏవైనా అదనపు వసతులు అవసరమా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అని అన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రతి పనికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మిగిలిన నిర్మాణ పనులను కూడా డిసెంబర్ నాటికి పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు, బోధనా సిబ్బంది, వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత వైద్య, ఇంజినీరింగ్, నిర్మాణ శాఖల అధికారులు, నర్సింగ్ కళాశాల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వరలక్ష్మీ శుక్రవారం సందర్భంగా వేములవాడ మహాలక్ష్మీ ఆలయంలో విశేష పూజలు





**వేములవాడ, ఆగస్టు,21, తెలంగాణ పత్రిక.**

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి ఆలయ అర్చకులు ఉదయం,సాయంత్రం చతుష్షష్టి ఉపచారములతో విశేష పూజలు ఏకాంతంగా నిర్వహించారు. అలాగే సాయంత్రం 4.00 గంటల నుంచి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి షోడశోపచార పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వరలక్ష్మీ శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి అమ్మవారికి ఓడి బియ్యం, గాజులు, చీరెసారెలతో వాయనాలు సమర్పించి, కుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు కుటుంబ సౌఖ్యం, ఐశ్వర్యం, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర సదుపాయాలను ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు సమకూర్చారు.ఈ సందర్భంగా శ్రీ మహాలక్ష్మీ ఆలయాన్ని మామిడి ఆకుల తోరణాలు, కొబ్బరి ఆకులు, రంగురంగుల పూలతో సుందరంగా అలంకరించి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చారు. విశేష పూజలతో ఆలయం భక్తజన సందోహంతో కళకళలాడింది.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి






**-ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి.**
**-పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 21**

వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేశారు, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలకు సత్వర న్యాయం అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును ఒక్కొక్కరిగా అడిగి తెలుసుకున్నారు. పేకాట, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించడం తో పాటు, దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని సూచించారు. చోరీకి గురైన ఆస్తి రికవరీ పై ప్రత్యేక దృష్టి సారిస్తూ దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని, ఈ-సాక్ష్య, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం సైబర్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్-112కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పర్యావరణం పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, సీఐ నాగరాజు, ఎస్సైలు యయాతి రాజు, రాజేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయొద్దు

**– బీజేపీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి వాసరి యాదమల్లు**



**నంగునూరు, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):**

ప్రభుత్వ పాలిటెక్నిక్ లను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వాసరి యాదమల్లు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలిటెక్నిక్ లు గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అందిస్తున్నాయని చెప్పారు. తరగతి తర్వాత తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అభ్యసించే గ్రామీణ, మధ్యతరగతి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ముఖ్యమైన అవకాశాలను అందిస్తున్నాయన్నారు. వాటి ప్రత్యేకతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. విలీనంతో విద్యార్థుల డిప్లొమా విద్య, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యా అవకాశాలు, అధ్యాపకుల ఉద్యోగ భద్రతపై అనిశ్చితి ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఆధునిక నైపుణ్య శిక్షణ అందించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని చెప్పారు. అయితే పాలిటెక్నిక్‌లను విలీనం చేయడం కాకుండా రెండు వ్యవస్థల మధ్య అనుసంధానం పెంచి విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని వాసరి యాదమల్లు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తే పలు అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాల్సి ఉంటుందని యాదమల్లు అభిప్రాయపడ్డారు. డిప్లొమా కోర్సుల గుర్తింపు, సిలబస్, పరీక్షా విధానం, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సదుపాయాలు, డిప్లొమా తర్వాత బీటెక్ ప్రవేశ అవకాశాలు ఎలా ఉంటాయన్నది స్పష్టం చేయాలన్నారు. అధ్యాపకుల సర్వీస్ నిబంధనలు, పదోన్నతులు, బదిలీలు, ఉద్యోగ భద్రత, వేతనాలు, అర్హత ప్రమాణాలు, అకడమిక్ స్వయం ప్రతిపత్తి వంటి అంశాలపై ఆందోళన నెలకొందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ లకు ఉన్న భూములు, భవనాలు, ప్రయోగశాలలు, వర్క్‌షాప్‌లు, పరికరాలు వంటి ప్రజా ఆస్తుల యాజమాన్యం, వినియోగం, భద్రతపై పారదర్శక విధానం ఉండాలని చెప్పారు. ఈ విషయాలపై స్పష్టత లేకుండా హఠాత్తుగా పునర్వ్యవస్థీకరణ చేపట్టడం విద్యా రంగంలో అనిశ్చితికి దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

## వృద్ధుల పట్ల గౌరవం -- సమాజ ప్రగతికి ప్రతీక




**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, తెలంగాణ పత్రిక**

వృద్ధులను భారంగా కాకుండా సమాజానికి విలువైన మార్గదర్శకులుగా భావించి, వారికి గౌరవం, ప్రేమ, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఆడెపు వేణు అన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి బి. పుష్పలత ఆదేశాల మేరకు, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. లక్ష్మణాచారి సమన్వయంతో శుక్రవారం రగుడులోని రంగినేని ట్రస్టులో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆడెపు వేణు మాట్లాడుతూ.. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు Maintenance and Welfare of Parents and Senior Citizens Act, 2007 వంటి చట్టపరమైన రక్షణలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తమ హక్కులకు భంగం కలిగినప్పుడు సంబంధిత అధికారులను లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని వృద్ధులకు అవగాహన కల్పించారు.అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ట్రస్టులోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం వారిలో భరోసా నింపింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గుర్రం ఆంజనేయులు, బూర మధుసూదన్, రంగినేని ట్రస్టు ప్రిన్సిపల్ వెంకట్రావు, ట్రస్టు ఇన్‌చార్జి తిరుమల్ రెడ్డి, హెడ్‌మాస్టర్ ఎం.డి. అంకుస్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ లింగంపల్లి మధుసూదన్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్య ప్రమాణాలు మెరుగుపరచాలి

**– డీఐఈవో పరశురాం**




**ముధోల్:21ఆగస్టు(తెలంగాణ పత్రిక)**

విద్యార్థుల విద్య ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా డీఐఈవో పరశురాం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగ్స్, షూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం, నోట్స్ పుస్తకాలను పరిశీలించి పలు సూచనలు అందజేశారు. సబ్జెక్టులను గడువులోగా పూర్తిచేసి, ప్రాక్టికల్స్ సకాలంలో చేయించాలన్నారు. దీంతో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట ఇంచార్జీ ప్రిన్సిపల్ రహమాన్, అధ్యాపకులు గంగాధర్, శ్రీనివాస్, నారాయణ, శంషాద్దీన్, స్వరూప, సురేష్‌లు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**ఆత్మకూర్, ఆగస్టు 21: (తెలంగాణ పత్రిక):**

మండలంలోని నాగయ్యపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల రాజమ్మ (70) అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.4వేల ఆర్థిక సాయం అందజేసి, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. గ్రామంలోని పేదలకు ఆపద సమయంలో సహాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సరస్వతీ శిశు మందిర్‌లో సామూహిక వరలక్ష్మి వ్రతం

**-పూజలో పాల్గొన్న మహిళలు**





**ముధోల్:21ఆగస్టు(తెలంగాణ పత్రిక)**

శ్రావణ రెండవ శుక్రవారం పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి మందిర్ ప్రీ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహానికి గాజులు, చీర, పువ్వులతో సుందరీకరంగా అలంకరించారు. వేద పండితులు ప్రకాశాస్త్రి, ప్రణీత్ శాస్త్రి లు వేద మంత్రాల మధ్య పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. వక్తలుగా కోడల్ల రమా, బింద్రే మహానందలు శ్రీ వరలక్ష్మి వ్రత విశిష్టత ను వైభవంగా తెలియజేశారు.ఈ పూజలో తానుర్ యోగేష్, కుమ్మరి సురేష్ దంపతులు సతి సమేతంగా మొక్కుల చెల్లించుకున్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ముత్యాలు పలువురని ఎంతగానో ఆకట్టు ఉన్నాయి. వరలక్ష్మి వ్రతంలో సుమారు 50 మంది మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టి ఒకరినొకరు వాయినాలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఆచార్యులు, సమితి, ప్రబంధకారిణి సభ్యులు పాల్గొన్నారు.

## స్టేషన్ రోడ్డును శుభ్రం చేయించిన ఉప సర్పంచ్ రఫీ



**చేగుంట ఆగస్టు 21 తెలంగాణ పత్రిక న్యూస్**

మెదక్ జిల్లా చేగుంట స్టేషన్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డితో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ విషయాన్ని గమనించిన గ్రామ ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ తన సొంత నిధులతో శుభ్రం చేయించారు. జేసీబీ సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, రోడ్డు పై మొరం చల్లించి చదును చేయించారు. దీంతో స్థానికులు అభినందిస్తున్నారు.

## ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు



**తానూర్: 21 ఆగస్టు (తెలంగాణ పత్రిక)**



వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకోని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వరలక్ష్మి వత్రం పూజలు ఘనంగా నిర్వహించారు పాఠశాలలో వరలక్ష్మి మి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని పాఠశాల లో వరలక్ష్మి పూజలు నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రధాన ఆచార్యులు చంద్రకాంత్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల మాతాజీలు ప్రియాంక, ప్రసన్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న జయంతి, వర్ధంతికి రాష్ట్ర కార్యక్రమాల హోదా

**-ముదిరాజ్ సంఘం హర్షం**

**నంగునూరు, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):**



పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలుగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడం పట్ల సిద్దిపేట జిల్లా నంగునూరు మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గౌరబోయిన సంపత్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవోఆర్టీ నంబర్ 1217 ద్వారా ఈ నెల 20వ తేదీన ఉత్తర్వులు జారీ చేయడం ముదిరాజ్ సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇకపై ప్రతి సంవత్సరం అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతి, డిసెంబర్ 10న పండుగ సాయన్న వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ కార్యక్రమాలను రాష్ట్ర కార్యక్రమాలుగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడం విశేషమని సంపత్ తెలిపారు. భావితరాలకు స్ఫూర్తిగా పండుగ సాయన్న పండుగ సాయన్న చరిత్ర, ఆయన పోరాట స్ఫూర్తి, సామాజిక సేవలు, ప్రజల కోసం చేసిన కృషిని భావితరాలకు పరిచయం చేయడంలో ప్రభుత్వ నిర్ణయం కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. సామాన్య ప్రజల పక్షాన నిలిచి, సామాజిక న్యాయం కోసం పోరాడిన పండుగ సాయన్న చరిత్రకు రాష్ట్ర స్థాయిలో అధికారిక గుర్తింపు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను వివిధ ప్రాంతాల్లో స్థానికంగా నిర్వహించగా, రాష్ట్ర కార్యక్రమంగా గుర్తింపు లభించడంతో ఆయన చరిత్ర, వ్యక్తిత్వం, పోరాట స్ఫూర్తి మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఏర్పడిందన్నారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కల్పించడం ముదిరాజ్ సమాజానికి గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కేవలం ఒక వర్గానికి సంబంధించిన గౌరవం మాత్రమే కాదన్నారు. తెలంగాణ చరిత్రలో ప్రజా ఉద్యమాలు, సామాజిక పోరాటాలు, ప్రజాసేవకు గుర్తింపు ఇచ్చే చర్యగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నిర్ణయం ద్వారా పండుగ సాయన్న జీవితం, ఆయన చేసిన సేవలు, పోరాట పటిమ, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతపై యువత, విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు మరింత అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న జయంతి, వర్ధంతిని రాష్ట్ర కార్యక్రమాలుగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు నంగునూరు మండల ముదిరాజ్ సంఘం తరఫున గౌరబోయిన సంపత్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ముదిరాజ్ సంఘం స్వాగతిస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు మరింత విస్తృతంగా చేరవేసేందుకు సమాజం కృషి చేస్తుందని ఆయన అన్నారు.

# పాలిటెక్నిక్ లను శక్తిలో చేర్చితే ప్రైవేట్ జోక్యం పెరుగుతుంది

**-రాజగోపాల పేట పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బూరం అభినవ్**

**-ఐదో రోజూ కొనసాగిన నిరసన**

**-నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో పాలిటెక్నిక్ విద్య పరిరక్షణకు నినాదాలు**

**నంగునూరు, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):**




పాలిటెక్నిక్ లను స్కిల్ యూనివర్సిటీలో చేర్చితే ప్రైవేట్ రంగం జోక్యం పెరిగి ఇంజినీరింగ్ విద్యా ప్రమాణాలు దెబ్బ తింటాయని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ అభినవ్ తెలిపారు. ఫీజులు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. షార్ట్ టర్మ్ కోర్సులతో విద్యా నాణ్యత తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిణామాలతో విద్యార్థులు, ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందని, ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. తెలంగాణ పాలిటెక్నిక్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీ--పీజేఏసీ) పిలుపు మేరకు, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను శక్తిలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాజగోపాల్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ వద్ద సిబ్బంది గురువారం ఐదో రోజు నిరసన చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి, చేతిలో నినాదాల ఫలకాలు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. "పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి.. శక్తిలో విలీనాన్ని నిలిపివేయాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీ--పీజేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థకు ఉన్న ప్రత్యేకత, స్వయం ప్రతిపత్తిని కాపాడాలని డిమాండ్ చేశారు. విలీన ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ విద్య, విద్యార్థుల భవిష్యత్తు, సిబ్బంది ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుత నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. "పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి -- శక్తిలో విలీనాన్ని నిలిపివేయాలి." అని డిమాండ్ చేశారు. రాజేశ్, సయ్యద్ షాహబాజ్, పాతూరి శ్రీనివాస రెడ్డి, రాజమౌళి, కవిత, జ్యోతి, వైదేహి, దీపిక, సంతోష్, కిషోర్, నవీన్, కమల్ అహ్మద్, మంజుల, వాణి, భాగ్యలక్ష్మి, బాలమణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు...

# పాలిటెక్నిక్ విద్య విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

**-రాజగోపాలపేటలో విద్యార్థుల రాస్తారోకో**

**-జాతీయ రహదారిపై నిలిచిన వాహనాల రాకపోకలు**

**నంగునూరు, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):**





పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శనివారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిద్దిపేట--హనుమకొండ జాతీయ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి తమ డిమాండ్లకు అనుకూలంగా నినాదాలు చేయడంతో కొంతసేపు రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల విద్యార్థుల విద్యా ప్రగతి, ఉన్నత విద్యావకాశాలు, ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేకమైన విద్యా విధానం, సాంకేతిక కోర్సులు, ప్రయోగాత్మక శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా రూపొందిన పాఠ్యప్రణాళిక ఉన్నాయని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యను ప్రత్యేక సాంకేతిక విద్యా వ్యవస్థగానే కొనసాగించాలని, విలీన ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని విద్యార్థులు కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని, విలీన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళన కారణంగా సిద్దిపేట--హనుమకొండ ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు సంఘీభావం తెలిపారు. రెడ్డి యాదగిరి, తప్పెట పరశురాములు, దాసరి రమేశ్, చింటు గౌడ్, ఎండీ గఫూర్, ఇమ్రాన్, అనిల్ రెడ్డి, అప్పాల శేఖర్, సాయి, బెదురు నర్సింలు, బిక్షపతి, సాయి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఆకుల రాజు, నాంపల్లి వెంకటేశ్, చిన్న, సోహెల్, అనిల్, వినయ్, కాటం రాజు, ప్రకాష్, దువ్వల రాజు, చరణ్, శ్రీను, ప్రసాద్, రఘు, కార్తీక్, రాజు, ఇరుగంటి రమేశ్, చెట్టుపల్లి భాను చందర్, సంపంగి శ్రీకాంత్, జి. శ్రవణ్ గౌడ్, మన్నె ఆనంద్, గుండెల్లి నాగరాజు, ఎల్క అనిల్, లక్కీ ప్రభాకర్ తదితరులు పాల్గొని విద్యార్థుల డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న రాజగోపాలపేట పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, డిమాండ్లను తెలుసుకున్నారు. అనంతరం ఆందోళనను విరమించాలని సూచించడంతో విద్యార్థులు రాస్తారోకోను విరమించారు. దీంతో పోలీసులు రహదారిపై నిలిచిపోయిన వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలన్న ప్రతిపాదనపై విద్యార్థుల్లో ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో రాజగోపాలపేటలో జరిగిన రాస్తారోకో ప్రాధాన్యం సంతరించుకుంది. తమ విద్యా భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో ప్రభుత్వం విద్యార్థులతో చర్చించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటుందా, లేక విద్యార్థుల ఆందోళన మరింత విస్తరిస్తుందా అన్నది వేచి చూడాల్సి ఉంది.

## బీజేపీ జిల్లా నాయకుల ఆత్మీయ సమ్మేళనం

**తాండూరు ఆగస్టు 21,(తెలంగాణ పత్రిక):**



వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన శ్రీ యు. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం తాండూరు పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ శ్రీ మారుతి కిరణ్ బూనేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాల పై జిల్లా నాయకులతో ఆత్మీయంగా చర్చించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమెరికా ఓక్లాండ్ వేదికపై ఒగ్గుకథ వైభవం అభినందనీయం

--ఓబీసీ ఆధ్వర్యంలో కళాకారులకు ఘనంగా సన్మానం

వేములవాడ, ఆగస్టు,21, తెలంగాణ పత్రిక.

తెలంగాణ జానపద కళకు అంతర్జాతీయ వేదికపై మరోసారి అరుదైన గౌరవం దక్కింది.వేములవాడకు చెందిన ప్రముఖ ఒగ్గుకథ కళాకారుడు స్వర్గీయ మిద్దె రాములు అందించిన కళా వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన మనుమడు మిద్దె వినీత్,ఆయన కుమారుడు మిద్దె పర్షరాములు అమెరికాలోని ఓక్లాండ్ వేదికపై ఒగ్గుకథ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.సిలికాన్ ఆంధ్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళా వైభవాన్ని ప్రవాస భారతీయుల సమక్షంలో చాటిచెప్పారు. ఒగ్గుకథకు అమెరికా వేదికపై లభించిన ఆదరణ తెలంగాణ కళా సంపదకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపుగా పలువురు అభివర్ణించారు. తరతరాలుగా కొనసాగుతున్న మిద్దె కుటుంబ కళా వారసత్వాన్ని విదేశీ గడ్డపై సైతం కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిద్దె వినీత్, మిద్దె పర్ష రాములు ప్రతిభను అభినందిస్తూ భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా



అధ్యక్షులు రేగుల సంతోష్ బాబు ఆధ్వర్యంలో కళాకారులను ఘనంగా సన్మానించారు.ఒగ్గుకథ వైభవాన్ని ప్రపంచ స్థాయి కీర్తికి తీసుకెళ్లడం అభినందనీయమని కొనియాడారు.అనంతరం సంతోష్ బాబు మాట్లాడుతూ వేములవాడకు చెందిన కళాకారులు వేలాది కిలోమీటర్ల దూరంలోని అమెరికా వేదికపై ఒగ్గుకథను ప్రదర్శించడం వేములవాడతో పాటు యావత్ తెలంగాణకు గర్వకారణమన్నారు.స్వర్గీయ మిద్దె రాములు అందించిన కళా వారసత్వాన్ని ఆయన కుటుంబ సభ్యులు సమర్థవంతంగా కొనసాగిస్తూ తెలంగాణ జానపద కళకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం ప్రశంసనీయమని అన్నారు. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తున్న కళాకారులను ప్రభుత్వం,



ప్రజలు ప్రోత్సహించాలని సంతోష్ బాబు కోరారు. ఒగ్గుకథ వంటి ప్రాచీన జానపద కళారూపాలను కాపాడి,భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మిద్దె రాములు కుటుంబ వారసులు ప్రదర్శించిన ఒగ్గుకథ అమెరికా వేదికపై మార్మోగడం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలారం శ్రీనివాస్,జక్కుల తిరుపతి,బుర్ర శేఖర్ గౌడ్,వివేక్ రెడ్డి,రేగుల రాజ్ కుమార్,నేరెళ్ల సాయి,మల్లారం తిరుపతి,నామాల శేఖర్,నందరగిరి రాహుల్,నేరెళ్ల కిరణ్, ఖమ్మం పృథ్వీరాజ్,అన్నారం శివ,కార్తీక్,హరీష్,శ్రీ రామ్ లతో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో బెల్ట్ షాపులను నిషేధించాలని సర్పంచ్ కి వినతి పత్రం

ఓదెల ఆగస్టు 21 తెలంగాణ పత్రిక

ఓదెల మండల కేంద్రంలో బెల్ట్ షాపులను నిషేధించి యువతను మద్యానికి బానిసలు కాకుండా కాపాడాలని శుక్రవారం ఓదెల సర్పంచ్ మరియు పాలకవర్గం మరియు కార్యదర్శికి వినతి పత్రం సమర్పించిన గ్రామ యువకులు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓదెల గ్రామంలో బెల్ట్ షాపులు దాదాపు 20 పైచిలుకు ఉన్నాయని వాటి వలన యువత మద్యానికి అలవాటై తన విలువైన జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారని అంతేకాకుండా మందు సేవించి ఇంట్లో తల్లిదండ్రులను భార్య పిల్లలను అనేక ఇబ్బందులు పెట్టి కుటుంబాలను అంధకారంలో నెట్టేస్తున్నారని చాలా మంది మద్యానికి బానిసై తన విలువైన ప్రాణాలను కోల్పోయి భార్యా పిల్లలను అనాధలను చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఇలాంటి బెల్టు షాపుల వలన గ్రామంలో అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపులోనే మద్యం సేవిస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయని రాత్రిపూట మహిళలు ఏదైనా అవసరం వస్తే రోడ్డుపైకి రావాలంటే భయపడుతున్నారని అన్నారు వీటన్నిటికీ బెల్టుషాపులే కారణమని వెంటనే వాటిని గ్రామంలో నిషేధించి ఎవరైనా బెల్ట్ షాపులు అమ్మిన వారిపై కఠినమైన ఆంక్షలు విధించాలని సర్పంచ్ మరియు కార్యదర్శిని కోరినట్టు తెలిపారు ఈ విషయంపై స్పందిస్తూ తప్పకుండా గ్రామ పాలకవర్గంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని




హామీ ఇచ్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీష్ కనకిరెడ్డి ఉప సర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్ వార్డు సభ్యులు రాపల్లి రాజయ్య దూలం సదానందం గొర్ల శ్రీనివాస్‌తో పాటు తుడి సురేష్ ముదిరాజ్. బీరం రవి ఆసంశెట్టి కృష్ణ. దొంగరి రాజేష్ మంద రాజయ్య ముదిరాజ్ పెండం ఓదెలు ముదిరాజ్ గొడుగు కనకయ్య తుడి శ్రీనివాస్ ముదిరాజ్. పచ్చిమట్ల బన్నీ గౌడ్ మార్క సాయి తేజ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత





- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్

కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ పత్రిక):

వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా శుక్రవారం హేమచంద్రపురం గ్రామంలోని అమ్మానాధాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు న్యాయ అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌కు కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రాజేందర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమాజానికి అందించిన సేవలు, వారి అనుభవం ఎంతో విలువైనవని అన్నారు. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు, అవసరమైనప్పుడు అందుబాటులో ఉన్న న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వృద్ధుల సంరక్షణ, భద్రత, గౌరవప్రదమైన జీవనం కోసం చట్టపరమైన రక్షణలు ఉన్నాయని, అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. డీఎంహెచ్ఓ డా. తుకారామ్ రాథోడ్ మాట్లాడుతూ.. వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. సీనియర్ సిటిజన్స్ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, కంటి చూపు, రక్తపోటు, మధుమేహం తదితర సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. వైద్య శిబిరంలో కంటి పరీక్షలతో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. దీపిక, తిరుమలరావు, స్వప్న శ్రావణి, లక్ష్మి, దేవా, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, న్యాయవాది మెండు రాజమల్లు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు సుధాకర్ రావు, అమ్మానాధాశ్రమం నిర్వాహకులు హిమ తేజ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఎస్సీ మోర్చా సూర్యపేట జిల్లా కమిటీ నీ ప్రకటించిన జిల్లా బిజెపి పార్టీ దళిత మోర్చా అధ్యక్షుడు బొజ్జ పరశురాం మాదిగ

తెలంగాణ పత్రిక సూర్యాపేట ఆగస్టు 21

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా సూర్యాపేట జిల్లా నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు బొజ్జ పరశురాం ప్రకటించారు. బిజెపి పార్టీ సూర్యపేట జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి చల్ల శ్రీలత రెడ్డి గారు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కాంతి కిరణ్ గారు జిల్లా ఇన్చార్జి తూట్ పల్లి రవి గారు ఎస్సీ మోర్చా జిల్లా ఇన్చార్జి అంకురి నరసింహ ఆదేశాల మేరకు పార్టీ కోసం పని చేస్తూ పార్టీని అభివృద్ధి చేస్తూ పార్టీ గెలుపును కృషి చేయాలని ఈ నియామకాలు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా: పిడిమర్తి అనిల్, చిత్రాల సురేందర్, మేకల ఇమాన్యుల్, అల్లే రాములు, బొజ్జ రోహిత్ ప్రధాన కార్యదర్శులుగా: వల్లపట్ల మహేష్, బొల్లేపొంగు కాశయ్య, కంపాటి రాజు కార్యదర్శులుగా: ఏర్పుల సాయి, వల్దాస్ చరణ్, విడతల శంకర్, కడారి ఎల్లయ్య కొంపల్లి గణేష్ కోశాధికారిగా: ఎరకచర్ల సన్నీ అధికార ప్రతినిధిగా చాగంటి మురారి సామాజిక మాధ్యమాల బాధ్యుడిగా తుమ్మలపల్లి వెంకటేష్ సాంకేతిక విభాగ ఇన్చార్జిగా బజ్జ ప్రేమ్ కుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా నెవెలి లింగయ్య పిడమర్తి సౌజన్య కాంపాటి వెంకటేశ్వర్లు పొరపాటు విమల ఉప్పల రామచందర్ కొండేటి జయమ్మ గణేష్ ఈ ఎస్ఎంహెచ్ కమిటీలో నియమించడం జరిగింది.



## జిఓ97ని ప్రభుత్వం రద్దు చేయాలి-పోతు అనిల్ కుమార్

- అగ్రహారంలో రోడ్డు పై ధర్న చేస్తున్న బి ఆర్ ఎస్వి నాయకులు
- పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వైఖరి కాంగ్రెస్ పార్టీ నాయకుడిలా వున్నది. బి ఆర్ ఎస్వి







వేములవాడ అర్బన్, ఆగస్టు, 21, తెలంగాణ పత్రిక.

జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద బీఆర్ఎస్వీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రాంగణంలోకి వెళ్లేందుకు యత్నించిన విద్యార్థి నాయకులను ప్రిన్సిపాల్, పోలీసులు నిరోధించడంతో వారు కళాశాల ఎదుట రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బి ఆర్ ఎస్వి నాయకులు మాట్లాడుతూ.రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్న కు మద్దతు గా ఈరోజు అగ్రహరం కళాశాల విద్యార్థులతో కలిసి ధర్న నిర్వహించే క్రమంలో ప్రిన్సిపాల్ మరియు స్థానిక పోలీస్ బలగాలు విద్యార్థులను కళాశాలలో నిర్బందించి బయటకు రాకుండా విద్యార్థుల హక్కులకు భంగం కలిగించి కాంగ్రెస్ పార్టీ నాయకులాగా వ్యవహరించిన తిరుకు నిరసనగా బి ఆర్ ఎస్వి నాయకులు రోడ్డు పై బేటాంచి ధర్న నిర్వహించడం జరిగింది శక్తి స్కీమ్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని 97 జి ఓ రద్దు చేయాలనీ నినాదాలు ఇస్తూ నిరసన చేస్తున్న నాయకులను అరెస్ట్ చేసి వేములవాడ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ కార్యక్రమం లో కంచర్ల రవి. పోతు అనిల్. మల్యాల అరుణ్.కళ్యాణ్. జుబేర్. విద్యార్థులు ఉన్నారు.

## గురుకుల కళాశాలను తనిఖీ చేసిన ఎంపీవో




ముధోల్: 21ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలను ఎంపీవో శివకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్య బోధన, విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వంటగది,స్టోర్ రూమ్ లో శుభ్రత ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించాలని కళాశాల సిబ్బందికి సూచించారు.వర్షాకాల దృశ్య విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్ కే.వెంకటేష్ విద్యార్థులకు మెనూ ప్రకారంగా అందిస్తున్న భోజన పట్టిక వివరాలను తెలియజేశారు. ఈయన వెంట పంచాయతీ కార్యదర్శి ఆన్వర్ ఆలీ ఉన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక



## ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య...



పాపన్నపేట, ఆగస్టు 21:(తెలంగాణ పత్రిక)

కడుపు నొప్పితో బాధపడుతూ ఉరి వేసుకుని ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామంలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన వగ్గు రశిత (14) మండలంలోని యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో ఎనిమిదివ తరగతి చదువుతుంది.తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది. పలుమార్లు హాస్పిటల్ లలో వైద్యం చేసిన కడుపు నొప్పి తగ్గడం లేదు. శుక్రవారం ఉదయం సమయంలో కడుపు నొప్పితో బాధపడుతూ ఇంట్లో దిగులుగా ఉంది.తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగానే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.కొంత సమయం తరువాత గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.మృతురాలి తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## సూర్యాపేటలో ప్రైవేట్ ఉపాధ్యాయుల శాంతియుత నిరసన ర్యాలీ




తెలంగాణ పత్రిక, సూర్యాపేట, ఆగస్టు 21

నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లి గ్రామంలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్యకు గురి కావడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆమె ఆత్మకు శాంతి కలుగాలని కోరుతూ యునైటెడ్ ట్రస్మా, తెలంగాణ ప్రైవేట్ టీచర్ అండ్ లెక్చరర్న ఫెడరేషన ఆద్వర్యంలో శుక్రవారం 2వేల మంది ఉపాద్యాయులు, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువదని అలాంటి గురువును దారుణంగా హత్య చేయడం దారుణమన్నారు. ఏ గురువైనా విద్యార్థులను మంచిగా ఉండమని చెబుతారు తప్ప చెడిపోమ్మని కాదన్నారు. తమ నుంచి విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు గంజాయికి బానిసై, మాదకద్రవ్యాలకు అలవాటు పడి చెడు ప్రవర్తనతో ఉంటే మందలించడం రూపారెడ్డి తప్పా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య భారతదేశంలో టీచర్లకు రక్షణ, కఠిన చట్టాలు లేక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలు స్పందించి నవతరాన్ని తయారు చేసే ఉపాధ్యాయులకు రక్షణ కల్పించడంతో పాటు వారి కోసం కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఏది చెప్పినా అది మన మంచి కోసమే అని విద్యార్థులు గ్రహించాలని అప్పుడే వారు మంచి పౌరులుగా సమాజంలో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ట్రస్మా ప్రతినిధులు త్రివేణి హరి, ఆర్.ప్రకాశ్రెడ్డి, పగడాల ఉపేందర్రెడ్డి, రామసాని శ్రీనివాసనాయుడు, ఖమ్మంపాటి భిక్షపతి, గాలి రమేష్, మారం లింగారెడ్డి, వెంపటి అజయ్కుమార్, తీగల ఉపేందర్రావు, టీపీటిఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహరావు, గౌరవాధ్యక్షులు సోమ రాజు, ఉపాధ్యక్షులు బాలక్రిష్ణ, రాజశేఖర్ లతో పాటు పెద్ద ఎత్తున ప్రైవేట్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం

తెలంగాణ పత్రిక, ఇల్లందు ఆర్సీ (ఆగస్టు21):



ఇల్లందుమున్సిపాలిటీ పరిధిలోని 22వవార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ ఆధ్వర్యంలో స్థానిక సూపర్ బజార్ ఏరియా అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, వారికి దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల జీవితంలో విద్యాభ్యాసానికి తొలిఅడుగు అంగన్వాడి కేంద్రాల నుంచే ప్రారంభమవుతుందని చిన్నవయసులోనే విద్యపట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణ వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ప్రతిచిన్నారికి మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తల్లిదండ్రులు, అంగన్వాడి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అజ్మీర సక్కుబాయి, ఆశావర్కర్ చెడుపాక కరుణ, స్థానిక కాంగ్రెస్ నాయకురాలు కొల్లపురి ఝాన్సీ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం ఐజేయు ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం

**- సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి**

జగిత్యాల, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం జగిత్యాలకు వచ్చిన మంత్రిని కలిసిన జర్నలిస్టు నాయకులు మంత్రికి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై నివేదిక తయారుచేసి వెంటనే తనకు పంపాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ను ఆదేశించారు. అంతకు ముందు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రి పొంగిలేటికి వినతిపత్రం అందజేశారు. శాసన మండలి సభ్యుడు ఎల్. రమణ ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న జగిత్యాల జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా టీయూ డబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చీటీ శ్రీనివాసరావు బెజ్జంకి సంపూర్ణచారి మాట్లాడుతూ ప్రజా స్వామ్యానికి నాలుగో స్థంభంగా భావించే జర్నలిస్టులు సమాజంలో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. నిరంతరం ప్రజా సేవలో భాగస్వాములవుతున్న జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. గత 30 సంవత్సరాలుగా జగిత్యాల పట్టణంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని గతంలో ఇళ్ల స్థలాల కోసం తాము ఉద్యమాలు కూడ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ ను వెంటనే పరిష్కరించాలని మంత్రిని కోరగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాల చారి యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.

# సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో ఐఎఫ్టీయూ కార్మిక జిల్లా సదస్సు

కొత్తగూడెం: ఆగస్టు 21 (తెలంగాణ పత్రిక)




కాంట్రాక్టు, మోటార్-ఆటో, హమాలీ, గ్రామ పంచాయతీ, మున్సిపల్, స్కీం, హాస్టల్, భవన నిర్మాణం తదితర సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత కార్మిక సంఘాల సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సదస్సు స్థానిక CER క్లబ్ నందు ఉదయం 10:00 గంటలకు ప్రారంభమవుతుంది.

**ప్రధాన డిమాండ్లు:**

హక్కులు & సమాన వేతనం: కాంట్రాక్ట్ కార్మికులకు 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేయాలి. సింగరేణి కార్మికులు: సింగరేణిలో 2013 నుండి హై పవర్ వేతనాలు అమలు చేయాలి మరియు స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి. వేతనాల పెంపు: గ్రామీణ పంచాయతీ, మున్సిపల్, హాస్టల్ వర్కర్ల వేతనాన్ని నెలకు 26,000లకు పెంచి, ప్రతి నెల 1న చెల్లించాలి. రెగ్యులరైజేషన్: కేటీపీఎస్, ఆర్టీసీ, కాంట్రాక్ట్ మరియు ఎన్ఎమ్ఆర్ వర్కర్లను క్రమబద్ధీకరించాలి (పర్మినెంట్ చేయాలి). ఆటో ఒ రవాణా రంగ కార్మికులు: ఉచిత బస్సు పథకం వల్ల ఆదాయం కోల్పోయిన ఆటో కార్మికులకు నెలకు 10,000 ఆర్థిక సహాయం అందించాలి. సంక్షేమ బోర్డులు: హమాలీ, మోటార్ వాహన మరియు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలి. ఇందిరమ్మ ఇండ్లు: సొంత ఇల్లు లేని కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి.

**ముఖ్య అతిథులు & వక్తలు:**

ఈ జిల్లా సదస్సుకు ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి అధ్యక్షత వహించనున్నారు.ప్రధాన వక్తలుగా ఐఎఫ్టీయూ జాతీయ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర రావు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నగంటి రవి, ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జే.సీతారామయ్య పాల్గొననున్నారు. కార్మికుల చట్టబద్ధమైన హక్కులు, సంక్షేమం కోసం జరగబోయే ఈ జిల్లా సదస్సును, ప్రదర్శనను జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ నాయకులు ఎమ్.డి. రాసుద్దీన్, డి. ప్రసాద్, తోడేటి నాగేశ్వరరావు, గాని నాగేశ్వర రావు తదితరులు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు.

# పాక్సో కేసులో నిందుతుడికి 4 సంవత్సరాల జైలు శిక్ష 2000 వేల జరిమానా

**- శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను, పీపీ లను సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 21



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగ ప్రవర్తించిన (పోక్సో) కేసులో నిందుతుడికి 4సంవత్సరాలు జైలు శిక్ష 2000 వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ శుక్రవారం రోజున తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు కేసు వివరాల్లోకి వెళితే గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పాఠశాల ప్రాంగణంలో గోడా ధూకి బాలికలతో ఏగదండి రాజేందర్ అనే వ్యక్తి అసభ్యకరంగ ప్రవర్తించగా , పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మెరకు గంభీరావుపేట పోలీస్ స్టేషన్లో అప్పటి ఎస్.ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్ కి తరలించడం జరిగింది అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 10మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ వాదించగా,శాస్త్రీయ ఆధారాలు,సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన ఏగదండి రాజేందర్ కు 4సంవత్సరాలు జైలు శిక్ష 2000 వేల జరిమాన విధించారు సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని,శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు.పోలీసులు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ,న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి ఎస్ఐ మహేష్, ప్రస్తుత డిఎస్పీ నాగేంద్రచారి , పబ్లిక్ ప్రాసిక్యూటర్ ,జాన్సీ, ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ సి.ఐ ఓ.వెంకటేష్ గంభీరావుపేట ఎస్.ఐ శ్రీకాంత్, కోర్టు మానిటరిశీగ్ ఎస్.ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ,కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను , లీగల్ సపోర్ట్ పర్సన్ లహరిక లను జిల్లా ఎస్పీ అభినందిచారు.

# మోతే మండలంలో దంపతుల హత్య కేసులో నిందితుడి పై చర్యలు

**- ప్రధాన నిందితుడు పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్ షరీఫ్ పోలీస్ ఉద్యోగం నుండి డిస్మిస్.**

తెలంగాణ పత్రిక, సూర్యాపేట, ఆగస్టు 21

సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్ షరీఫ్ను పోలీస్ ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగిస్తూ (డిస్మిస్) జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మోతే మండల కేంద్రంలోని ఒక వ్యవసాయ భూమిలో పాతిపెట్టిన భార్యాభర్తల మృతదేహాల ఘటనపై మోతే పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో అత్యంత వేగంగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరానికి పాల్పడిన నిందితులను పట్టుకుని, వారిని రిమాండ్కు తరలించడం జరిగింది. ఈ దారుణ హత్య ఉదంతంలో మోతే పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ షరీఫ్ ప్రధాన నిందితుడిగా తేలడం, అతను ప్రస్తుతం రిమాండ్లో ఉండడంతో ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించింది. చట్టాన్ని రక్షించాల్సిన స్థానంలో ఉండి ఇటువంటి ఘాతుకానికి ఒడిగట్టడం తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా భావిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు సదరు కానిస్టేబుల్ను ఉద్యోగం నుండి తొలగిస్తూ తక్షణ ఆదేశాలు జారీ చేశారు.- కేసులో ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటి సెక్షన్ లు పెట్టడం జరిగినది.డిఎస్పీ నీ కేసు దర్యాప్తు అధికారిగా నియమించాం.కేసులో త్వరగా తీర్పు రావడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు కు పంపుతాం. నేరస్థులకు త్వరగా కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తున్నాం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా కంపెంజేశన్ త్వరగా వచ్చేలా చర్యలు తీసుకున్నాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా సొంత శాఖకు చెందిన వారైనా సరే ఉపేక్షించేది లేదని, చట్టం ముందు అందరూ సమానులేనని ఈ చర్య ద్వారా జిల్లా పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది.



# పాలమాకుల వెంకటేశ్వర ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

**నంగునూరు, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వరలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కలశస్థాపన, వరలక్ష్మీదేవి ఆరాధన, మంత్రోచ్చారణల మధ్య సామూహిక వ్రతాలను నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో హాజరై పూజా సామగ్రితో ప్రత్యేకంగా అలంకరించిన వరలక్ష్మీదేవి ప్రతిమల ఎదుట వ్రతాన్ని ఆచరించారు. కుటుంబంలో సుఖ శాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం, సౌభాగ్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మహిళలు భక్తిగీతాలు, మంగళ హారతులతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

**గీత మందిర దాతృత్వ సంస్థ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ**

ఈ సందర్భంగా గీత మందిర దాతృత్వ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాల పంపిణీతో పాటు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులకు అన్నప్రసాదాన్ని అందించారు. అన్నదానం మహాదానమనే భావనతో భక్తులకు భోజన సదుపాయం



కల్పించడం పట్ల పలువురు భక్తులు నిర్వాహకులను అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంతో పాటు సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా భక్తిలో సేవా భావాన్ని చాటారని పేర్కొన్నారు. సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించడం వల్ల మహిళల్లో ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు పరస్పర ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆలయంలో మరిన్ని ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.సామూహిక వరలక్ష్మీ వ్రతాలు,అన్నసంతర్పణ కార్యక్రమాల తో పాలమాకుల వెంకటేశ్వర ఆలయం భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావానికి వేదికగా నిలిచింది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గీత మందిర దాతృత్వ సంస్థ ప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రేవంత్ రెడ్డి లక్ష్యం





**- తెలంగాణ రాష్ట్రం లో కొత్తపల్లి గ్రామ క్రీడాకారులు గర్వకారణం**
**- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి**

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 21**

కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రేవంత్ రెడ్డి లక్ష్యం తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు ఉద్యమమకారులవి అయితే భోగాలు మాత్రం బీ ఆర్ ఎస్ నాయకులవి అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు శుక్రవారం రోజున మండలంలోని కొత్తపల్లి గ్రామంలో త్రో బాల్ ఆటలో రాష్ట్ర స్థాయిలో గెలిచిన మహిళా క్రీడాకారులను కేకే మహేందర్ రెడ్డి సన్మానించి అభినందించి జ్ఞాపికలను అందించారు, అనంతరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర లో కొత్తపల్లి గ్రామ క్రీడాకారులు త్రో బాల్ ఆట లో ప్రతిభ చాటి ఈ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారన్నారు, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అనీ ఉద్యోగాలు ఇచ్చేది అభివృద్ధి చేసేది కూడా కాంగ్రెస్సే అని అన్నారు,కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యం గా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని కేకే మహేందర్ రెడ్డి అన్నారు,క్రీడాకారులకు ఓ అన్నగా ప్రోత్సాహం అందిస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు,మండల పార్టీ మాజీ అధ్యక్షులు హమీద్,నాయకులు రాజనర్సింహరెడ్డి తో పాటు నాయకులు పాల్గొన్నారు.

# ‘22-ఏ’ అంటే బీఆర్ఎస్‌కు భయం ఎందుకు

**- అక్రమ భూములు తిరిగి ప్రభుత్వం, దళితుల చేతుల్లోకి వెళ్తుంటే ఆందోళన ఎందుకు**
**- టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి**

**నంగునూరు, ఆగస్టు 21(తెలంగాణ పత్రిక):**

‘22-ఏ’ అంటే బీఆర్ఎస్ నాయకులు ఎందుకంత భయపడుతున్నారని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి ప్రశ్నించారు. అక్రమంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ, దళితుల భూములు తిరిగి ప్రభుత్వం, అర్హులైన దళితుల చేతుల్లోకి వెళ్తుండటాన్ని చూసి మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన విమర్శించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన బీఆర్ఎస్ నాయకులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములు, దళితుల భూములు పెద్దఎత్తున ఆక్రమణలకు గురయ్యాయని ఆరోపించారు. ప్రస్తుతం వాటిని ప్రభుత్వం గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునే చర్యలు చేపడుతోందని అన్నారు. హరీశ్ రావు, ఇతర బీఆర్ఎస్ నేతలు ఎందుకు ఆందోళన చెందుతున్నారని ప్రశ్నించారు. ధరణి పోర్టల్ పేరుతో భూముల వ్యవహారాల్లో గతంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఫామ్ హౌస్‌లలో కూర్చొని భూములన్నింటినీ అనుకూలమైన వారికి పంచుకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో దళితులకు కేటాయించిన భూములను వారి పేర్ల నుంచి మార్చి ఇతరుల పేర్ల పైకి తీసుకెళ్లిన వారిపై చర్యలు తీసుకుంటే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేయడం వెనుక అసలు ఉద్దేశం



ఏమిటని ప్రశ్నించారు. అక్రమంగా సంపాదించిన ఆస్తులు, భూములు ఎప్పటికీ నిలవవని యాదగిరి అన్నారు. ప్రభుత్వం వాటిని గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు. భూముల విషయంలో ప్రభుత్వం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న విమర్శలను తప్పుబట్టారు. ఇకనైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని బీ ఆర్ ఎస్ నాయకులు పశ్చాత్తాపం వ్యక్తం చేయాలని యాదగిరి సూచించారు. లేకపోతే అక్రమాలకు పాల్పడిన వారిని ప్రజలే ప్రశ్నిస్తారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న భూసంస్కరణ చర్యలకు ప్రజలు, బాధిత దళిత కుటుంబాలు అండగా నిలవాలని ఆయన కోరారు.

## ఈజీఎస్ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన బిజెపి మండల అధ్యక్షులు కోడే రమేష్

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 21**

స్థానిక పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ సహకారంతో ఈజీఎస్ నిధుల ద్వారా ముస్తఫానగర్ గ్రామంలో సర్పంచ్ బండ సుకన్య దేవయ్య ఆధ్వర్యం లో చేపడుతున్న 15లక్షల సీసీ రోడ్డు పొన్నలపల్లె గ్రామ సర్పంచ్ పొన్నాల మహేష్ ఆధ్వర్యంలో 10 లక్షల డ్రైనేజీ పనులను బీజేపీ మండల అధ్యక్షులు కోడె రమేష్ పరిశీలించారు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల రూప కల్పనకు కృషి చేస్తున్న స్థానిక పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్‌కి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న సర్పంచ్‌లతో పాటు బీజేపీ నాయకుల పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలు తీర్చే అభివృద్ధి పనులకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అభివృద్ధి – ప్రజా సంక్షేమం – బీజేపీ లక్ష్యం అని ఈ నిధులు కేటాయించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి స్థానిక పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్‌కి సర్పంచ్‌లు, బిజెపి మండల అధ్యక్షులు కోడె రమేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బండా సుకన్య దేవయ్య, పొన్నాల మహేష్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ కృష్ణకాంత్ యాదవ్ దేవేందర్ యాదవ్ నర్సింలు శ్రీనివాస్ గౌడ్



నారాయణ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలి

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**



**తెలంగాణ పత్రిక, సూర్యాపేట, ఆగస్టు 21**

జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పైసీ దర్బార్ బిర్యానీ సెంటర్‌ను ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సందర్భంగా కొప్పుల వేణారెడ్డి మాట్లాడు తూ సూర్యాపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పైసీ దర్బార్ బిర్యానీ సెంటర్ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.వ్యాపార రంగంలో నూతనంగా అడుగుపెడుతున్న నిర్వాహకులు వినియోగదారుల అభిరుచులకు అను గుణంగా నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు రుచికరమైన బిర్యానీతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తూ మంచి పేరు సంపాదించాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో కొత్తగా వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు షేక్ నాసిర్, మాజీ ఉమ్మడి నల్గొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అయూబ్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కుందమల్ల శేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, బాలెంల మాజీ సర్పంచ్ రామసాని రమేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్, రాపర్తి నాగరాజు, వెన్న ఉపేందర్, షేక్ రహీం, కోడి కిరణ్, తలారి రాజేష్, అనంతుల నవీన్, పిల్లల నాగరాజు, షేక్ గౌస్ పాషా, నూకల మనోజ్, రావుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నాభావు సాఠే ఆశయాల సాధనకు పాటు పడాలి



**తానూర్: 21 ఆగస్టు (తెలంగాణ పత్రిక)**

మండలంలోని నందిగామ్, బోరిగాం, బేల్తారొడ, గ్రామాల్లో అన్నా భావు సాఠే జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ సింధే ఆనంద్‌రావ్ పాటిల్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నాభావు సాఠే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. తన రచనలు, సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిలించిన మహనీయుడని తెలియజేశారు ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నందిగామ్ సర్పంచ్ లక్ష్మీబాయి,బేల్తారొడ సర్పంచ్ గోప సుజాత సాయినాథ్ బోరిగాం సర్పంచ్ సూధాకర్, ఉప సర్పంచులు, నాయకులు, మాజీ జెడ్పిటిసి భలే రావు ఉత్తం, గైక్వాడ్ సాయినాథ్, మారొతి, కొత్తూరు శంకర్, అనిల్ కలేకర్, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, అన్నా భావు సాఠే కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సోదరులు ఇకపై కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారానే ఎరువులు పొందగలరు ఏవో భాస్కర్

**ఓదెల ఆగస్టు 21 తెలంగాణ పత్రిక**



ఓదెల మండలంలోని రైతు సోదరులందరూ ఇక నుండి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రేమ్. వర్క్ ఫర్టిలైజర్ సేల్ ఎఫ్ ఎస్ సి అనే కొత్త యాప్ ద్వారానే ఎరువులను బుక్ చేసుకోగలరని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ పేర్కొన్నారు ఈ సందర్భంగా శుక్రవారం పోత్కపల్లి రైతు సహకార సొసైటీ లో కొత్త ఎరువుల బుకింగ్ యాప్ విధానాన్ని పరిశీలించిన ఏవో భాస్కర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సోదరులు ఇకనుండి ఫ్రేమ్ వర్క్బ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ అనే కొత్త యాప్ ద్వారానే ఎరువులను బుక్ చేసుకోవాలని అన్నారు ఈ యాపు ప్రతి స్మార్ట్ ఫోన్‌లో ప్లే స్టోర్‌లో అందు బాటులో ఉంటుందని దాన్ని ఇన్స్టాల్ చేసుకొని అవసరమైన ఎరువులు మండలంలో ఉన్న ఎరువుల దుకాణాల్లో బుక్ చేసుకోవాలని తెలియజేశారు ఈ యాప్ లో ఏవైనా సాంకేతిక లోపాలుంటే సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులకు మరియు డీలర్లను సంప్రదించాలని తెలియజేశారు తప్పకుండా రైతులు ఈ యాప్ ద్వారానే ఎరువులు తీసుకోవాలని ప్రతి ఒక్కరు దీని ఇన్స్టాల్ చేసుకుని బుక్ చేసుకోవాలని తెలిపారు.

## ఘనంగా జననాయకుడి జన్మదిన వేడుకలు.





రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 21 తెలంగాణ పత్రిక.

శంషాబాద్ పట్టణంలో ప్రజా ఆదరణ కలిగిన జననాయకుడిగా ఎదిగిన రేణిగుంట్ల గణేష్ గుప్తా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. శుక్రవారం నాడు ఆయన జన్మదినం సందర్భంగా శంషాబాద్ పట్టణంలో జన్మదిన వేడుకలలో అనేక ప్రముఖులు పాల్గొని బొకేలు ఇచ్చి శాలువా తో సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భారీ గజమాలతో ఆయనను సత్కరించారు. శంషాబాద్ పట్టణంలో గణేష్ గుప్తా సర్పంచ్ గా ఉన్ననాటి కాలం నుంచి శంషాబాద్ పట్టణాన్ని ఎంతగానో అభివృద్ధి చేశాడని నాయకులు సందర్భంగా గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని నలుమూలల నుండి యువకులు,కాంగ్రెస్పార్టీ నాయకులు, స్నేహితులు ఇతర పార్టీ నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ పాల్గొని గణేష్ గుప్తా చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

## మిల్లర్లపై ఉక్కుపాదం సివిల్ సప్లై లోకి కమాండోలు.!

– గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల నుంచి అధికారుల డెప్యుటేషన్..



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై ఉక్కుపాదం మోపేందుకు పౌరసరఫరాల (సివిల్ సప్లైస్) శాఖలోకి ప్రత్యేక కమాండోలను రంగంలోకి దించుతోంది. రాష్ట్రంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన కౌంటర్ టెర్రరిజం విభాగాలైన 'గ్రేహౌండ్స్', 'ఆక్టోపస్' బలగాల నుంచి అధికారులను పౌరసరఫరాల శాఖలోకి డెప్యుటేషన్‌పై తీసుకునేందుకు చర్యలు చేపట్టింది. మిల్లుల్లో ధాన్యం నిల్వల లెక్కింపు, రీ-సైక్లింగ్ బియ్యం అక్రమ రవాణా అరికట్టడం, ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సివిల్ సప్లైస్ శాఖ చరిత్రలోనే ఎలైట్ పోలీస్ విభాగాల అధికారులను నియమించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## గిరిజన విద్యార్థి సంఘం చేస్తున్న నిరాహార దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 21:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ: గిరిజన విద్యార్థి సంఘం, ఎల్ హెచ్ పి ఎస్ సంఘాల ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సి, ఎస్టీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ ఎస్సీ ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా కల్పించాలని నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. విద్యార్థి సంఘాలు చేపడుతున్న న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు, ఎల్ హెచ్ పి ఎస్ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చక్కెర ధరలకు కళ్లెం.. 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్.!

ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. వాటిలో ఊహించిన దానికంటే తక్కువ దేశీయ చక్కెర ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, చెరకు పంటకు వాతావరణం వల్ల కలిగిన నష్టం, అలాగేదేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను నియంత్రించడానికి, రాబోయే పండుగ సీజన్‌లో తగినంత లభ్యతను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రకారం చక్కెర ధర జూలై 20న కిలోగ్రాముకు రూ.. 48.18నుండి ఆగస్టు 20 నాటికి కిలోగ్రాముకు రూ. 55.70కి పెరిగింది.ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనవసరమైన ధరల పెరుగుదల, నిల్వలు, కృత్రిమ కొరతలను నివారించడానికి చర్యలు తీసుకుంటోంది పండగల వేళ 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుతించింది కేంద్రం. చక్కెర వ్యాపారులకు 400 టన్నుల స్టాక్ లిమిట్‌ను విధించింది.అయితే చక్కెర నిల్వలపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది ఇటీవలి చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తిని నిందించడం సరికాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో సుమారు 12% నుండి 2025-26 నాటికి సుమారు 9%కి తగ్గుతుంది. అంతేకాకుండా, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో సుమారు ముప్పావు వంతు ఇప్పుడు ధాన్యాల నుండి, ప్రధానంగా మొక్కజొన్న నుండి ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. వాటిలో ఊహించిన దానికంటే తక్కువ దేశీయ చక్కెర ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, చెరకు పంటకు వాతావరణం వల్ల కలిగిన నష్టం, ప్రపంచ వ్యాప్తంగా చక్కెర సరఫరా కొరత, పరిశ్రమలోని కొన్ని వర్గాలలో ఊహాగానాలు, నిల్వలు వంటివి ఉన్నాయి.చక్కెర ఉత్పత్తి ప్రాథమిక అంచనాల కంటే తక్కువగా.. చెరకు పండించే రాష్ట్రాలు మొదట్లో అంచనా వేసిన సుమారు 343 లక్షల మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి సుమారు 306 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. చెరకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ తెగుళ్లు, అలాగే అధిక వర్షపాతం వల్ల ఏర్పడిన నీటి నిల్వ కారణంగా ఉత్పత్తి దెబ్బతింది. అంచనా వేసిన దానికంటే ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పటికీ, అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ అవసరాలను తీర్చడానికి దేశంలో తగినంత చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా చక్కెర ధరలు పెరుగుతున్నాయి. చక్కెర సరఫరా కొరత అనేది ప్రపంచవ్యాప్త పరిణామం, ఇది భారతదేశానికే పరిమితం కాదు. 2026-27 సంవత్సరానికి ప్రపంచ చక్కెర కొరత సుమారు 33 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేయగా, వాతావరణ పరిస్థితుల పై ఆందోళనలు ప్రపంచ దృక్పథాన్ని మరింతగా ప్రభావితం చేశాయి. ఫలితంగా అంతర్జాతీయ చక్కెర ధరలు 30 జూన్ 2026న టన్నుకు 474 నుండి 20 ఆగస్టు 2026 నాటికి టన్నుకు 552కు భారీగా పెరిగాయి. రెండు నెలల కన్నా తక్కువ వ్యవధిలోనే 16% పైగా పెరుగుదల నమోదైంది. ఇథనాల్ కార్యక్రమం రైతులకు సహాయపడి, చక్కెర మిల్లులను బలోపేతం చేసింది. భారతదేశం సాధారణంగా సంవత్సరానికి సుమారు 320-340 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరను ఉత్పత్తి చేస్తుంది. అయితే దేశీయ వినియోగం సుమారు 280-290 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుంది . ఉత్పత్తి అధికంగా ఉన్న సంవత్సరాలలో, అదనపు నిల్వలు చక్కెర మిల్లుల నిధులను నిలిపివేసి, చెరకు రైతులకు చెల్లింపులను ఆలస్యం చేయగలవు. అదనపు చక్కెరను ఇథనాల్ వైపు మళ్లించడం ఈ నిర్మాణాత్మక సమస్యను పరిష్కరించడంలో సహాయపడి, చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచింది. ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2026 ఆగస్టు 20 నాటికి, 2025-26 చక్కెర సీజన్‌కు సంబంధించిన చెరకు బకాయిలలో 97 శాతాన్ని రైతులకు ఇప్పటికే చెల్లించారు. చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో, ప్రభుత్వ మద్దతుపై వాటి ఆధారపడటం కూడా తగ్గింది. 2014 నుండి 2021 మధ్య చక్కెర పరిశ్రమకు సుమారు రూ. 14,600 కోట్ల సబ్సిడీని అందించగా, 2021-22 నుండి అటువంటి సబ్సిడీ ఏదీ ప్రకటించబడలేదు. అదే సమయంలో వినియోగదారులకు చక్కెర ధరలు దీర్ఘకాలంలో స్థిరంగా ఉన్నాయి. ఆగస్టు 2024 మరియు జూలై 2026 మధ్య సంవత్సరానికి సుమారు 3% మాత్రమే పెరిగాయి. నిల్వలకు వ్యతిరేకంగా, సరఫరాను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# శ్రీ నల్లపోచమ్మ, భూలక్ష్మి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం.



– కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్.



తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆగస్టు 21.

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని లింగంపల్లి గ్రామంలో ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న గ్రామ దేవతలైన శ్రీ నల్లపోచమ్మ, భూలక్ష్మి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి హాజరై ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొన్న...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ దేవతలైన శ్రీ నల్లపోచమ్మ, భూలక్ష్మి అమ్మవార్లు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రక్షగా ఉండాలని అలాగే వారి దివ్య ఆశీస్సులతో అందరికీ అష్టఐశ్వర్యాలు,ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నానన్నారు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలలో సామరస్యం, భక్తిభావాన్ని పెంపొందిస్తాయన్నారు, ఈ నల్ల పోచమ్మ, భూలక్ష్మి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ దైవకార్యానికి మరియు ఆలయాభివృద్ధికి తన వంతు సహాయంగా రూ.2,00,000 (రెండు లక్షల రూపాయలు) విరాళాన్ని అందించడంపై గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, రాబోయే రోజుల్లో ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న అందజేస్తానని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో లింగంపల్లి గ్రామస్తులు లింగంపల్లి డివిజన్ కంటేస్టేడ్ కార్పొరేటర్ ఎల్లేష్, కిషోర్, రవి యాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్, కృష్ణ యాదవ్, సోమయ్య యాదవ్,నరేందర్ యాదవ్,బాబు, శ్రీను, విజయ్, మొదలగు వారు పాల్గొన్నారు.

# రైతులకు పరిహారం చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

– కామారెడ్డి జిల్లా కలెక్టర్

కామారెడ్డి ,ఆగస్టు 21, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి జిల్లా క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్. తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ. 2,800 కోట్లు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పెండింగ్ భూసేకరణకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్. నీటి పారుదల శాఖ ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143